

ఇళ్ల వద్దే ఈకేవైసీ : జేసీ

ఏలూరుసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):దీపం-2 పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఈకేవైసీకి ఎవరూ గ్యాస్ ఏజన్సీల వద్దకు వెళ్లనవసరం లేదు. గ్యాస్ డెలివరీ బాయ్స్ వినియోగదారుల ఇళ్లకే వచ్చి ఉచితంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకున్నాం' అని జేసీ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. దీపం-2పై జిల్లాలోని గ్యాస్ డీలర్లు, ఆయిల్ కంపెనీల యాజమానులు, పౌరసరఫరాల అధికారులతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. లబ్ధిదారులకు ఏమైనా ఇబ్బందులుంటే 1967 టోల్‌ఫ్రీ నెంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో మొదటి ఉచిత సిలిండర్ కోసం 1,05,214 లబ్ధిదారులు బుకింగ్ చేసుకోగా ఇప్పటి వరకు 78,752 మంది పొందారని, వీరికి సబ్సిడీ సొమ్ము రూ.4.30 కోట్ల సబ్సిడీ విడుదలైందని చెప్పారు.

రూ.3.28 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు

ఏలూరుసిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): 2024-25 ఖరీఫ్ పంటకాలానికి సంబంధించి జిల్లాలో ఇంత వరకు రూ.3.28 కోట్ల విలువైన 1417.280 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సమీపంలోని రైస్‌మిల్లులకు తరలించటం జరిగిందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. ధాన్యం కొనుగోళ్లల్లో సమస్యలుంటే కంట్రోల్‌రూమ్ నెంబర్లు 08812-230448కు ఫోన్ చేయాలని కోరారు.

కవ్వింపు.. కథేంటి !

జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెడతామంటూ జడ్పీటీసీల బెదిరింపులు

- ఉమ్మడి జడ్పీలో కొత్త కూని రాగాలు
- చైర్‌పర్సన్ దంపతులపైన వైసీపీ కవ్వింపులు
- పదేపదే సమావేశాలతో మాజీలంతా హడావుడి
- సజావుగా జడ్పీ సాగకూడదనే వైసీపీ ఎత్తుగడ
- భయపడేది లేదంటున్న చైర్‌పర్సన్ పద్మశ్రీ వర్గం

ఈ నెల 11న జడ్పీ ప్రత్యేక సమావేశంలో తీర్మానం పెట్టాలని వైసీపీ యోచన

శుక్రవారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాలను వైసీపీ జడ్పీటీసీలు 37 మంది బాయ్‌కాట్ చేశారు. కోరం సరిపోకపోవడంతో ఇది వాయిదా పడింది. మరోవైపు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై పార్టీ ఫిరాయింపులు చట్టం ప్రకారం ఈ నెల 11న జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతున్నట్టు జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ విజయ్‌బాబు తెలిపారు.



జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పద్మశ్రీ



6

మా నిధులు, మా ఉద్యోగాలు..

మాకే కావాలి

- ఆదివాసీ యువత నినాదం
- జీవో నెంబరు 3 రద్దుతో ఆందోళన
- దశల వారీగా ఉద్యమం ఉధృతం

పశ్చిమ ఏజెన్సీలో మా నిధులు, మా ఉద్యోగాలు మాకే కావాలనే నినాదం ఆదివాసీ యువత నుంచి గట్టిగా వినిపిస్తోంది. పోరాటాల ద్వారా సాధించుకున్న జీవో నంబరు-3ని సుప్రీం కోర్టు సాంకేతిక కారణాలతో రద్దు చేయడంతో ఆదివాసీలకు అండగా ఉన్న మరికొన్ని జీవోలకు ఎక్కడ గండి కొడతారనే ఆందోళనతో వారు రోడ్డెక్కారు. విరామం లేకుండా దశలవారీగా ఉద్యమాలను ఉధృతం చేస్తూ జీవో నం.3 పునరుద్దరణ, ప్రత్యేక ఉద్యోగాల నియమాక చట్టం, మా నిధులు, మా ఉద్యోగాలు అనే నినాదాలతో ముందుకు సాగుతున్నారు. గత ఇరవై రోజులుగా ఆదివాసీ నిరుద్యోగ యువత ఆందోళనలతో ఏజెన్సీ అట్టుడుకుతోంది.

బుట్టాయగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియమకాల్లో స్థానిక ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతోందని 2000లో అప్పటి ప్రభుత్వం జీవో నంబరు-3 తెచ్చి నూరు శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలను స్థానిక ఆదివాసీలకే ఇచ్చారు. జీవో నం.3తో పాటు మరిన్ని జీవోల ద్వారా ఏజెన్సీలోని ఆదివాసీలకు ఎంతగానో మేలు జరుగుతూ వస్తోంది. ట్రైబల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) ద్వారా చట్టాలు చేయలేదన్న సాంకేతిక కారణంతో 2020లో సుప్రీం కోర్టు జీవో నం.3ను రద్దు చేసింది. దీంతో ఆదివాసీల ఉపాధికి, ఉద్యోగాలకు గండిపడుతుందని గుర్తించిన ఆదివాసీ నాయకులు, యువత, ఉద్యోగులు ఆదివాసీలను చైతన్యపరచడంతో వారంత ఆందోళనబాట పట్టారు.

భవిష్యత్ అంధకారం



జీవో నంబరు.3 రద్దుతో తమ భవిష్యత్ అంధకారంగా మారుతుందని ఆదివాసీలు ఆందోళన చెందుతు న్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగ నియమకాలు నూరుశాతం ఏజెన్సీలోని స్థానిక ఆదివాసీలకే దక్కేవిధంగా జీవో నం.3 బలంగా పనిచేసేది. సాంకేతిక కారణాలతో రద్దు కావడంతో మరో 28 జీవోలకు గ్రహణం పడుతుందనే అనుమానాలు ఆదివాసీల్లో బలంగా ఉన్నాయి. అవి కూడా రద్దు కాకుండా ఉండాలంటే ఏజెన్సీ ప్రత్యేక ఉద్యోగ నియమాక చట్టం చేయాలి.

- మొడియం శ్రీనివాసరావు, ఆదివాసీ ఐక్య కార్యచరణ కమిటీ జిల్లా చైర్మన్



జీవో నంబరు 3ను పునరుద్దరించాలని ఇటీవల ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు (ఫైల్)

ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి

ప్రభుత్వం త్వరలో మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ ఇవ్వడానికి సమాయత్తం అవుతున్నందున డీఎస్సీ ప్రకటిస్తే ఏజెన్సీలోని ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతుందని, వేలాది టీచర్ పోస్టులు ఆదివాసేతరులు తన్నుకుపోతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని, ప్రత్యేక ఉద్యోగ నియమాక చట్టం చేయాలని డిమాండ్లను తెరపైకి తెచ్చారు. ఏజెన్సీలో 2,047 టీచర్ పోస్టులు ఉన్నాయని జీవో నం.3 రద్దుతో ఇవన్నీ ఇతరులకు కేటాయిస్తారని ఆందో ళన చెందుతున్నారు. డీఎస్సీ ప్రకటనకు ముందే ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, ఏజెన్సీ ఉద్యోగ నియమాక చట్టం చేయాలని పట్టుబడుతున్నారు. అప్పటి వరకు తమ పోరాటం ఆపేదిలేదంటూ చెబుతున్నారు.

న్యాయం కోసం పోరాటం



గతంతో పోలిస్తే ఆదివాసీలు విద్యాపరంగా అభివృద్ధి సాధించారు. తమకు రావాల్సిన ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలను ఇతరులు తన్నుకుపోతుంటే తట్టుకోలేకపోతున్నారు. జీవో నంబరు-3 రద్దుతో ఆదివాసీ నిరుద్యోగుల అవకాశాలకు గండి పడుతుంది. న్యాయం చేయమంటూ గొంతెత్తి నినదిస్తున్నారు.

- కోటం లక్ష్మణరావు, ఆదివాసీ నిరుద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇల్లు లేని పేదలకు.. తీపికబురు

- అర్హులైన లబ్ధిదారుల ఎంపికకు త్వరలో సర్వే
- పీఎంఏవై గ్రామీణ్ కింద ఇళ్ల కేటాయింపు
- సచివాలయ సిబ్బంది, సర్వేయర్లతో ముఖ ఆధారిత సర్వే
- జిల్లాలో వంద రోజుల టార్గెట్.. 5,429 ఇళ్లు నిర్మించాలనేదే లక్ష్యం



ఏలూరుసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 548 గ్రామ పంచాయతీల్లో ఇప్పటికీ కొంతమంది పేదలకు ఇల్లు లేని పరిస్థితులు ఉన్నాయి. ఎప్పటికప్పుడు గృహ నిర్మాణ పథకాల్లో ఇళ్ల కేటాయిస్తున్నా కొంతమంది పేదలకు ఇళ్లు కేటాయించడం లేదని, కట్టుకున్న వారికే తిరిగి ఇళ్ల మంజూరు చేస్తున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా అర్హులైన లబ్ధిదారులలో కొంతమందికి నేటికీ కొన్ని కారణాల వల్ల ఇళ్ల మంజూరు కావడం లేదనే విమర్శలు ఉన్నాయి. వీటికి చెక్ పెట్టాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆవాస్ 2.0 పేరిట జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయడానికి సర్వే నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సర్వేలో ఎంపికైన లబ్ధిదారులకు పీఎంఏవై గ్రామీణ్ కింద ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. జిల్లాలో ప్రతి లబ్ధిదారుని ఇంటికెళ్లి ముఖ ఆధారిత సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. జిల్లా గృహ నిర్మాణ సంస్థలో పనిచేసే హౌసింగ్ ఏఈల పర్యవేక్షణలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లతో పాటు సచివాలయాల్లో పనిచేసే ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఈ సర్వే నిర్వహించనున్నారు. జిల్లాలో ఈ సర్వే నవంబరు మొదటి వారంలో నిర్వహించాలని తొలుత నిర్ణయించినా కొన్ని రోజులు వాయిదా పడిందని చెబుతున్నారు. ఈ సర్వే పూర్తయిన తర్వాత అర్హులైన లబ్ధిదారులకు పీఎంఏవై గ్రామీణ్ పథకంలో ఇళ్ల కేటాయించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ భావిస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు ముఖ్యంగా ఈ పథకంలో ఇళ్ల కేటాయించాలనేదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యం.

జిల్లాలో 100 రోజుల ప్రణాళిక

జిల్లాలో పేదల గృహ నిర్మాణాలకు సంబంధించి 100 రోజుల ప్రణాళికను నిర్దేశించుకున్నారు. ఈ ప్రణాళికలో భాగంగా జిల్లాలో డిసెంబరు 31వ తేదీ లోగా 5,429 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇప్పటికే జిల్లాలో 1,200 వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.సత్యనారాయణ తెలిపారు. ఈ లక్ష్యాన్ని సాధించడం కోసం తమ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారని, లబ్ధిదారులు సహకరిస్తే ఈ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తవుతాయని ఆయన పేర్కొన్నారు.

అందిన కాడికి దోపిడీ!

- సర్టిఫికెట్ల కరెక్షన్‌కు అసలు కంటే భారీగా వసూళ్లు
- ఒక్కోపనికి రూ.500 నుంచి రూ.800 చెల్లిస్తున్న వైనం
- సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి
- అపార్ ఐడీ కోసం విద్యార్థుల పాట్లు

ఏలూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అపార్ ఐడీ కోసం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులు అన్ని ఇన్నీ కావు. ఒక దేశం, ఒక స్టూడెంట్ కార్డు పేరుతో జాతీయ నూతన విద్యావిధానం, 2020లో భాగంగా కేంద్రం తెచ్చిన ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. ఆపార్ నమోదు సమయంలో ఆధార్‌ను వినియోగించడం, అందులో వివరాలు తప్పుగా ఉండడంతో నమోదులో సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో విద్యార్హత సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు కోసం ఆధార్ సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. పుట్టినతేదీ సర్టిఫికెట్లలో కరెక్షన్ కోసం పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలకు బయట ఆధార్ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. వీరుపడే ఇబ్బందులు ఒక ఎత్తు అయితే అందుకు అయ్యేఖర్చు తడిచి మోపెడు అవుతోంది. ఏలూరు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు సర్టిఫికెట్ కరెక్షన్‌కు క్యూ కడుతున్నారు. మున్సిపల్, పంచాయతీల్లో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రాలు, సచివాలయాలు కూడా రద్దీగా మారుతున్నాయి. వీరి అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు సచివాలయ సిబ్బంది, బయట ఆధార్ కేంద్రాల నిర్వాహకులు వసూళ్ల పర్వానికి తెర లేపారు. దరఖాస్తు నింపడం నుంచి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్, ఆమోదం వరకు బాధితులకు చేతి చమురు వదిలి పోతోంది. సాధారణంగా జనన ధ్రువీకరణ పత్రంలో ఏదైనా కరెక్షన్ చేయాలంటే సుమారు రూ.100 చెల్లిస్తే కావాల్సిన సేవలు పొందవచ్చు. కాని అపార్ ఐడీ రద్దీ పెరగడంతో వీరి ఫీజు భారీగా పెంచేసినట్టు చెబుతున్నారు. రూ.100 చెల్లించాల్సిన పనికి రూ.500 నుంచి రూ.800 వరకు ఖర్చు అవుతుందని బాధితులు వాపోతున్నారు. మొదటిగా తమకు కావాల్సిన కరెక్షన్‌కు దరఖాస్తులో పూరించి సచివాలయంలో అప్‌లోడ్ చేస్తున్నారు. గతంలో బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నప్పుడు ఇన్‌సీల్‌తో ఉండగా, తాజాగా విద్యాసంస్థలో సర్ నేమ్‌తో సర్టిఫికెట్ అడుగుతున్నారు. ఈ క్రమంలో సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకువెళితే కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. అక్కడ అప్‌లోడ్ చేయగానే సచివాలయాలు బయట ఈ సేవా కేంద్రాల్లో అప్రూవల్‌తో పాటు కావాల్సిన ప్రింట్ అవుట్ తీసుకోవచ్చు. ఈ ప్రక్రియ వారం, పదిరోజులు పడుతుందని చెబుతుండగా అవసరం మేరకు సొమ్ములు తీసుకుని ఇచ్చేస్తున్నారు. సర్టిఫికెట్‌లో ఒకటి కంటే ఎక్కువ కరెక్షన్ ఉంటే దానికి అదనంగా వసూలు చేస్తున్నట్టు బాధితులు వాపోతున్నారు.

మా గోడు పట్టించుకోండి!

- హామీలు ఇచ్చి మరిచిన గత వైసీపీ ప్రభుత్వం
- ఉద్యోగ భద్రత కోరుతూ 104 ఉద్యోగుల పోరుబాట
- కూటమి ప్రభుత్వమైనా స్పందించాలని విజ్ఞప్తి
- మూడు నెలలుగా అందని జీతాలు
- సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 14 నుంచి సేవలు బంద్

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారం కోసం వైద్యఆరోగ్యశాఖ పరిధిలోని 104 వాహనాల ఉద్యోగులు పోరుబాట పట్టనున్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడం, సకాలంలో జీతాలు అందని పరిస్థితుల్లో కాంట్రాక్ట్ బేసిస్‌పై విధులు నిర్వహిస్తున్న 104 వాహనాల డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు (డీఈవో) ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యమానికి తెరతీశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో సమస్యలు మరింత జఠిలమయ్యాయి. జీతాలు కూడా సక్రమంగా అందని పరిస్థితి ఏర్పడింది. వాహనాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, సీనియర్ డ్రైవర్లకు ఐదేళ్లకు ఒకసారి రూ.5 వేలు జీతం పెంచుతామని, ఏటా 10 శాతం ఇంక్రిమెంట్లు కలుపుతామన్న హామీల్లో ఒక్కటి అమలు కాలేదు. వైసీపీ ప్రభుత్వం తమను అరబిందో యాజమాన్యానికి అప్ప గించడంతో, గత నాలుగున్నర ఏళ్లుగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించారు. గత మూడు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనాల డ్రైవర్లు, డీఈవోలు ఉద్యోగాల నుంచి తప్పుకునే పరిస్థితి ఏర్పడడంతో ఈ ఉద్యోగుల యూనియన్ రంగంలోకి దిగి 104 వాహనాల నిర్వహణ సంస్థ, ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. మారుమూల గ్రామాలకు సైతం వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది దాని తీసుకెళ్లే 104 వాహనాల డ్రైవర్లు, డిఈవోలు జీతాలందక పడుతున్న బాధితులను జిల్లా స్థాయి అధికారులు గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

14 నుంచి సేవలు బంద్ ..!

తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈనెల 14 నుంచి విధులను బహిష్కరించేందుకు 104 ఉద్యోగుల యూనియన్ నాయకులు నిర్ణయించారు. ఈనెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా, 11న గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత, 13న మండల కేంద్రాల్లో బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద వినతిపత్రాలను ఉంచాలని యూనియన్ నాయకులు ప్రకటించారు. అప్పటికీ ప్రభుత్వ పరంగా ఎటువంటి చర్యలు లేకపోతే 14న 104 సిబ్బంది జిల్లా కంపెనీ వాట్సాప్ గ్రూపుల నుంచి తప్పుకుని విధులు నిలిపేస్తామని నాయకులు తెలిపారు.



డిమాండ్లు ఇవే...

- 104 వాహనాలను ప్రభుత్వం పీహెచ్‌సీల ద్వారా నిర్వహించాలి.
- అరబిందో యాజమాన్యం నుంచి మూడు నెలల పెండింగ్ జీతాలు ఇప్పించాలి.
- మూడు సంవత్సరాల ఇంక్రిమెంట్లు ఇప్పించాలి.
- సీనియర్ డ్రైవర్లను వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ పద్దతిపై నియమించాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ యాజమాన్యం వాటా సొమ్మును యాజమాన్యమే చెల్లించాలి.
- 104 వాహనాలకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ చేయించాలి.
- 2020 తర్వాత చేరిన ఉద్యోగులకు భద్రత కల్పించాలి.

పెండింగ్‌లో జీతాలు

గత మూడు నెలలుగా 104 వాహనాల డ్రైవర్లు, డీఈవోలకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో 41 వాహనాలు ఉండగా, 41 మంది డ్రైవర్లు, 44 మంది డీఈవోలు ఉన్నారు. డ్రైవర్లకు మూడు నెలల పెండింగ్ జీతాలు రూ.25 లక్షలు, డీఈవోలకు రూ.20 లక్షలు నిర్వహణ సంస్థ చెల్లించాల్సి ఉంది.

ప్రభుత్వమే నిర్వహించాలి..



104 వాహనాలను 2016 వరకు ఉన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రైవేట్ సంస్థలకు కాంట్రాక్టుకు ఇవ్వడం రద్దు చేయాలి. ప్రస్తుతం ఒక్కో వాహనానికి ప్రభుత్వం నెలకు రూ.1.18 లక్షలు చెల్లిస్తుంది. ప్రభుత్వ నిర్వహిస్తే నెలకు రూ.50 వేల నుంచి 60 వేలు మాత్రమే ఖర్చవుతుంది. సిబ్బందికి జీతాల సమస్య ఉండదు. మూడు నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలి. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వమైనా మా సమస్యలు పరిష్కరించాలి.

- భరత్ భూషణ్, 104 వాహనాల సిబ్బంది, ఏలూరు జిల్లా అధ్యక్షుడు

ప్రజలకు మెరుగైన సేవలందిస్తాం : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న పోలీస్ సిబ్బంది సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి సంక్షేమ దివస్ నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న వివిధ పోలీస్ స్టేషన్ల సిబ్బంది, ఏఆర్ సిబ్బంది, హోంగార్డులు వారి సమస్యలపై వినతులను ఎస్పీకి అందించారు. సిబ్బంది సమస్యలను త్వరితగతిన పరిష్కారం చేయడానికి సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు.



సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

మూడో రోజు కొనసాగిన ఐటీ సోదాలు

భీమవరం క్రైం/ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ నివాసం, పరిశ్రమలు, సన్నిహితుల నివాసాల్లో మూడో రోజు ఐటీ దాడులు కొనసాగాయి. మద్రాసు నుంచి వచ్చిన ఆదాయ పన్ను శాఖ అధికారులు సోదాలు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి 10 మంది సభ్యుల బృందం సోదాలు చేపట్టి పలు కీలకమైన రికార్డులు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకుంది. గ్రంధి శ్రీనివాస్ నివాసంతోపాటు ఆయన సన్నిహితులు, వ్యాపార భాగస్వాములు ఏడుగురు నివాసాల్లోను దాడులు చేస్తున్నారు. ఈ దాడులు శుక్రవారం రాత్రి 10 గంటలకు కొనసాగుతూనే ఉన్నాయి. ఏలూరులోని ఆక్వా వ్యాపారి నూకల రామకృష్ణ నివాసంలో మూడో రోజు శుక్రవారం సెంట్రల్ ఇన్‌కమ్ టాక్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఆయన నివాసాల్లోనూ, కార్యాలయాల్లోనూ ఐటీ అధికారులు తనిఖీలు చేయడం ఇప్పుడు ఏలూరులో చర్చనీయాంశంగా మారింది. విలువైన రికార్డులు, ఆడిట్ రికార్డులు ప్రభుత్వానికి పన్నుల చెల్లింపుల వివరాలు ఇలా అన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

వైద్యుల చీటీ మేరకే ఔషధాల విక్రయం జరగాలి

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వైద్యులు ఇచ్చే చీటీ ప్రకారమే మందుల షాపుల్లో ఔషధాల విక్రయం జరుగుతున్నదీ, లేనిదీ డ్రగ్స్ నియంత్రణ విభాగం అధికారుల తనిఖీలు చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం అమలు తీరుపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వైద్యులు, డయాగ్నస్టిక్ సెంటర్ల యాజమాన్యాల పైనా చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీసీపీవో సూర్యచక్రవేణి, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, జీజీహెచ్ ఆర్ఎంవో శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బి.వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




విద్యుత్ చార్జీల పెంపు తగదు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ పీసీసీ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు లాంతర్లు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపు ప్రజలపై ఆర్థిక భారంగా మారిందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, జిల్లా ఇన్‌చార్జి సంజీవ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల ఎలీజా, గౌతు సత్యేంద్రబాబు, పీసీసీ అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, దెందులూరు ఇన్‌చార్జి ఆలపాటి నరసింహమూర్తి, పీసీసీ అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, ఏలూరు జిల్లా లీగల్ సెల్ చైర్మన్ వాసు బొద్దు, నియోజకవర్గ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జామాయిల్ చెట్ల నరికివేతపై విచారణ



కుక్కునూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు అటవీరేంజ్ పరిధిలోని మారేడుబాక బీట్‌లో జామాయిల్ కర్రలను అక్రమంగా నరికివేసిన సంఘటనపై శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అక్రమంగా జామాయిల్ చెట్లు నరికివేత' శీర్షికన కథనం వచ్చింది. దీనికి స్పందించిన కుక్కునూరు అటవీరేంజ్ అధికారిణి కృష్ణకుమారి క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ జరిపారు. నరికివేసిన చెట్లను పరిశీలించి ఎన్ని సంవత్సరాలుగా పెంచుతున్నారో వాటి వివరా లు ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అటవీ శాఖ వేసిన జామాయిల్ నర్సరీల్లో కొంత మంది పత్తిపంటలు వేశారనే ఆరోపణలు రావడంతో వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డీఆర్వో కేసరి, అటవీసిబ్బంది పాల్గొన్నారు.



భోజనం.. వన భోజనం

పరమ పవిత్రమైన కార్తీక మాసంలో వన భోజనాలకు చాలా విశిష్టత ఉంది. ఆధ్యాత్మిక ఆనందంతో పాటు ఆహ్లాదం, ఆరోగ్యం వన భోజనాల్లో ఇమిడి ఉంది.. పురాణాల్లో కూడా దీని ప్రస్తావన ఉంది.. కార్తీక పౌర్ణమి నాడు మును లందరూ నైమిశారణ్యంలో సూత మహాముని ఆధ్వర్యంలో వనభోజనాలు చేసినట్టు కార్తీక పురాణంలో ఉంది. కులమతాలకు, ధనిక, పేద వర్గ వైషమ్యాలకు అతీతంగా అందరూ కలిసి పచ్చని వనాల మధ్య సహపంక్తి భోజనాలు చేయడం ద్వారా మానవ సంబంధాలు బలపడతాయి..

ఆత్మీయతను పంచే కార్తీక వన భోజనాలు

ఆహ్లాదంతోపాటు ఆధ్యాత్మిక ఆనందం..

వనము అంటే అనేక వృక్షాల సముదాయం.. రావి, మర్రి, మారేడు, మద్ది, మోదుగ, జమ్మి, ఉసిరి, నేరేడు, మామిడి, వేప, పనస, తులసి, అరటి, జామ, కొబ్బరి, నిమ్మ చెట్లతో పాటు పూల మొక్కలతో ఆహ్లాదకర వాతావరణంతో పాటు దప్పిక తీర్చడానికి ఓ సెలయేరు ఉండాలి. ఇవి ఉన్నచోట జింకలు, కుందేళ్ళు, నెమళ్ళు, చిలుకలు వంటి సాదు జంతువులు తప్పకుండా ఉంటాయి. మొక్కలు, సాదు జంతువులు దేవతలకూ మహర్షులకు ప్రతిరూపాలు ప్రశాంతతకు. పవిత్రతకు నిలయాలు.. అలాంటి వనాలను ఏడాదికి ఒక్కసారైనా ప్రత్యేకంగా కార్తీక మాసంలో దర్శించాలని మన పూర్వీకులు నియమం పెట్టారు. ఆధ్యాత్మిక, ఆరోగ్య ఆనందకరమైన కారణాలు ఎన్నో ఉన్నాయి. కార్తీకమాసం నాటికి వానలు ముగిసి వెన్నెల రాత్రులు ప్రారంభమౌతాయి. చలి అంతగా ముదరని సమశీతోష్ణ వాతావరణంలో మనసుకి ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగించే మాసం కార్తీకమాసం. ఆరోగ్యకరమైన ప్రాణ వాయువుని పీలుస్తూ ప్రకృతిలో వనవిహారం చేసే మాసంగా పెద్దలు దీనిని పరిగణించారు. వనభోజనం అంటే కేవలం తిని తిరగడమే కాదు దానికీ ఓ పద్ధతి.. నియమం ఉంది. కాలకృత్యాలు స్నానాలు పూర్తి చేసుకున్న తర్వాత బంధుమిత్రులు, పరిచయస్తులు, ఇరుగు పొరుగు కలిసి జాతి, మత, కుల వివక్ష లేకుండా ఎంచుకున్న వనాలకు సూర్యోదయానికి ముందు చేరుకోవాలి. ముందుగా ఒక ఉసిరి చెట్టు కింద వనదేవత, ఇష్టదేవతాల విగ్రహాలను ఉంచి పూజించాలి. ఉసిరి చెట్టు నుంచి వచ్చే గాలి ఆరోగ్యానికి ఎంతో మేలు అని ఆయుర్వేద వైద్య విధానంలో చెప్పడం జరిగింది. మగవారు పాటలు పాడుతూ కూరలు తరుగుతుంటే.. ఆడవారు కొంగులు బిగించి వంటలు చేస్తుంటే.. పిల్లలంతా కలిసి ఆడుకుంటుంటే ఆ దృశ్యాల ఎంత చూడ ముచ్చటగా ఉంటాయి.. అటువంటి అందమైన ఆనందాల అనుభవాలే కార్తీక వన భోజనాల ఆంతర్యం. వంట పూర్తయిన తర్వాత వండిన పదార్థాలను పూజా స్థలానికి చేర్చి అందరూ కలిసి వన దేవతారాధన చేసి నివేదన చేసిన తర్వాత ఆ ప్రసాదాన్ని అందరూ కొసరి కొసరి తింటుంటే అబ్బో.. సమైక్య జీవనంలో ఇంత రుచి ఉంటుందా అనిపించక మానదు. వనభోజనాల య్యాక తిన్నది అరగాలిగా.. ఇక ఆట పాటలదే ప్రముఖ స్థానం.. అంతరించి పోతున్న ప్రాచీన సంప్రదాయ ఆటలకు ఈ వన భోజనాలే వేదికలు. ఈ ఆటల్లో పాటల్లో కొత్తస్నేహాలు, కొత్తపరిచయాలు, కొత్త అను బంధాలు ఏర్పడతాయి. కార్తీక మాసంలో కలిసిన ఈ కొత్త సంబంధాలు బంధుత్వాలుగా మారడానికి మాఘ, ఫాల్గుణ మాసాల్లో ముహూర్తాలు ఉంటాయి.. అందుకే మన పెద్దలు ఈ సంస్కృతిని ప్రారంభించారని చెప్పుకోవచ్చు.



- పోలవరం

పిక్నిక్‌కు వెళుతున్నారా !



కార్తీకమాసం అంటేనే వనభోజనాల సందడి..మరోపక్క దేవాలయాల సందర్శన.. పుణ్యం కోసం నదీస్నానాలు చేస్తారు. ఎప్పుడూ ఇల్లూ వాకిలి కదలని ఇల్లాలు కూడా కార్తీక మాసం కదా.. సరదాగా అలా తిరిగొద్దామని కుటుంబంతో కలిసి బయటకు వెళుతున్నారు. యువత పిక్నిక్‌ల పేరుతో చేసే సందడికి అంతే ఉండదు. అయితే యువత హద్దులు మీరి ప్రవర్తించడం, నిబంధనలను అతిక్రమించడం ద్వారా ప్రాణాల మీదకు తెచ్చు కొంటున్నారు. అందుకే విహార యాత్రలు విషాదంగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సరదాగా వెళ్లి ఎంజాయ్ చేశామా.. సేఫ్‌గా ఇంటికి వచ్చామా అన్నదే ముఖ్యం..

-నిడమర్రు

సరదాగా వెళ్లి క్షేమంగా రండి..!

కార్తీక మాసంలో విహారయాత్రలకు ప్రాధాన్యం

అజాగ్రత్తగా ఉంటే విషాదం..

గోదావరిలో సుడిగుండాలతో డేంజర్

బీచ్ స్నానాల్లో హద్దులు దాటొద్దు..

అడవుల్లోకి వెళితే అప్రమత్తత అవసరం

సుడిగుండాలతో జాగ్రత్త

నదీస్నానం చేయడానికి వచ్చే దూరప్రాంతాలు వాసులు ఇటీవల సంవత్సరాలలో ప్రమాదాలకు గురైన సంఘటనలు చాలా ఉన్నాయి. స్థానికేతరులు నదీ స్వభావం తెలియక ఉత్సాహంగా గోదావరి , కృష్ణా నదీ ప్రాంతాలలో లోతుకంటూ వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇసుక కోసం తీసిన గోతులలో స్నానమాచరిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అందుకే సోదరా జరభద్రం...

బీచ్‌లలో కేరింతలు

కార్తీక మాసం అంటే టక్కున గుర్తుకు వచ్చేది పేరుపాలెం బీచ్.ఈ బీచ్‌లో ఈ కార్తీక మాసంలో సందడి అంతాఇంతా కాదు. ఆదివారం నాడైతే సుమారు 25 వేల నుంచి 60 వేల మంది వరకు ఇక్కడ సముద్ర స్నానాలు చేసి ఆనందంగా గడిపినట్టు గత రికార్డులు చెబుతున్నాయి. వయ సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ సముద్రపు అలలతో ఆడుకుంటూ ఆహ్లాదంగా గడుపు తుంటారు. భౌగోళిక స్వరూపం పరిశీలిస్తే మన జిల్లాలో గల పేరుపాలెం బీచ్ కీలక మలు పులో ఉండడం వల్ల ఇక్కడి మట్టి ఎల్లప్పుడూ కోతకు గురివుతూ ఉంటుందని ఆర్కియాలజిస్టులు చెబుతున్నారు. ఈ మలుపు వల్ల సముద్రం తీరంలో సుడి గుండాలు ఎక్కువగా ఏర్పడి తీరం కోతను చేస్తూ లోతైన సుడిగుండాలను, గోతులను ఏర్పరుస్తాయి.



గుబ్బల మంగమ్మ ఆలయం

ఈ స్వభావం తెలియనని చాలామంది ఉత్సహంగా లోతుకు వెళుతూ ప్రమాదాల భారిన పడిన సంఘటనలు గతంలో జరిగాయి. మద్యం మత్తులో పోలీసు ఆంక్షలను లెక్కచేయకుండా వెళ్లి ప్రాణాలను కోల్పోతున్నారు.

సందర్శనీయ ప్రాంతాలు

పేరుపాలెం బీచ్ , అంతర్వేది తీరం, చించినాడ పాలవెల్లి రిసార్టులు, గోదావరి లంక ప్రాంతాలు, పంచారామ క్షేత్రాలైన భీమవరం, పాలకొల్లు దేవా లయాలు, ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయస్వామి దేవాలయంతో పాటు గుంటుపల్లి గుహలు, బుటాయగూడెం గుబ్బల మంగమ్మ తల్లి దేవాలయం తదితర ప్రాంతాలు చూడదగినవి..

అటవీ ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి


ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు అటు సముద్రతీర ప్రాంతం, నదీతీరప్రాంతం తోపాటు అటవీప్రాంతం కూడా కలసి ఉండడంతో జిల్లా వాసులు అటవీ సందర్శన కూడా ఎక్కువగా చేస్తుంటారు. ముఖ్యంగా కామవరపుకోట సమీపాన గల గుంటుపల్లి గుహలను, జంగారెడ్డి గూడెం సమీపాన గల గుబ్బలమంగమ్మ, పోలవరం అటవీ ప్రాంతాలను చాలామంది సందర్శించి ఆహ్లాదం పొందుతారు. డెల్టావాసులు కొండ ప్రాంతాన్ని, మెట్టవాసులు సముద్రతీర ప్రాంతాన్ని ఎక్కువగా సందర్శిస్తుంటారు. వన సందర్శన పేరుతో కుటుంబ సభ్యులతో కలసి, మిత్రులతో కలసి చాలామంది వన సందర్శన చేస్తూంటారు. ఈ అటవీ సందర్శన సమయంలో కొన్ని కొత్త జంటలు, ప్రేమికులు సందర్శన ప్రాం తాన్ని వదిలి ఏకాంతం కోసం అడవి లోపలికి వెళ్తూంటారు. ఇలా ఒంటరిగా వెళ్లే జంటలను టార్గెట్ చేస్తూ కొంతమంది వేచి ఉంటారు. అలా వెళ్లిన వారివద్ద సొమ్ము లాక్కోవడం, మహిళలపై బలాత్కారం చేయడం వంటి సంఘటన లు గతంలో చాలా జరిగాయి. అందుకే అటవీ ప్రాం తాన్ని సందర్శంచేవారు ఒంటరి ప్రయాణం చేయ రాదు. కొన్ని అటవీ ప్రాంతాల్లో క్రూర మృగాలు కూడా ఉంటాయి.. తగిన జాగ్రత్తలతో గుంపుగా ప్రయాణం చేయాలి.

జనసందోహంలో చిన్నపిల్లలు జర భద్రం !

పంచారామాలు, శ్రీశైలం, విజయవాడ, ద్వారకాతిరుమల, వంటి ప్రముఖ దేవాలయాల సందర్శన సమయంలో కుటుంబ పెద్దలు అప్ర మత్తంగా ఉండాలి. ఆ జనసందోహంలో పిల్లలను వదిలివేస్తే వారు తప్పిపోయే ప్రమాదం ఉంది. పిల్లలను ఓకంట కనిపెడుతూ పుణ్యక్షేత్రాల సందర్శన చేసుకోవాలి. పిల్లలకు ఒకవేళ తప్పిపోతే ఏ విధంగా స్పందించాలనే విషయంపై పూర్తి అవగాహన కల్పించాలి. పిల్లలకు ఫోన్ నంబర్ , అడ్రస్ చెప్పేలా తర్ఫీదు నివ్వాలి. ఒకవేళ మరీ చిన్న పిల్లలైతే వారి జేబులో అడ్రస్, ఫోన్‌నెంబర్ స్లిప్‌లు ఉంచాలి.



పేరుపాలెం బీచ్



గుంటుపల్లిలోని బౌద్ధ గుహలు

ప్రత్యేక బందోబస్తు



కార్తీక మాసంలో పశ్చిమ గోదావరి జిల్లాలో గోదావరి గట్టు, పేరుపాలెం అత్యంత రద్దీ ఉండే ప్రాంతాలుగా గుర్తించాం. ఈ ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కార్తీక పౌర్ణమి, ఆదివారాలు, సెలవు రోజులలో భక్తుల రద్దీ దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశాం. ముఖ్యంగా పేరుపాలెం బీచ్‌లో అలల ఉధృతి ఎక్కువగా ఉండే ప్రాంతాలు, ప్రమాదకర ప్రదేశాలను గుర్తించాం. పేరుపాలెం బీచ్‌లలో పోలీసు వారి సూచనలు తప్పనిసరిగా పాటించాలి. సముద్రంలో ముందుకు వెళ్లిపోకుండా సర్వే బాదులు అడ్డుకట్టగా ఏర్పాటు చేశాం. ఎప్పటికప్పుడు సిబ్బంది మైక్ ద్వారా హెచ్చరికలు చేస్తున్నారు. డేంజర్‌జోన్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం. బీచ్‌లో స్నానానికి వచ్చే వారు విలువైన వస్తువులు ధరించవద్దు.

- మురళీకృష్ణ , డీఎస్పీ, నరసాపురం

తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి



ఆనందం కోసం చేస్తున్న కార్తీకమాస విహార యాత్రలు విషాదయాత్రలు కాకూడదు. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, విద్యాసంస్థలు, విద్యార్థులు విహార యాత్రలు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తాత్కాలిక ఆనందాల కోసం నిండు జీవితాలను బలికొనే పరిస్థితులు తెచ్చుకొని కటుంబాలకు తీరని విషాదాన్ని మిగల్చవద్దు. విహారయాత్రకు వెళ్లే యువతీ యువకులు పిల్లలకు తల్లిదండ్రులు, ఇటు విద్యాసంస్థల యాజమాన్యం తగిన జాగ్రత్తలు చెబుతూ ప్రమాదాలపై ముందుగానే అవగాహన కల్పించాలి

- వెల్లంకి నరేష్‌కుమార్, లయన్స్ డిస్ట్రిక్ చైర్మన్ , ఉమ్మడి పశ్చిమ గోదావరి

ఎవరెస్టు బేస్ క్యాంపుపై టీడీపీ జెండా

తెలుగుదేశం పార్టీ అభిమాని సాహసం

పాలకోడేరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ బూత్ ఇన్‌ఛార్జ్ తోటకూర శ్రీనివాస్‌వర్మ ఎవరెస్ట్ శిఖరం బేస్ క్యాంప్‌పై టీడీపీ జెండాను రెపరెపలాడించి తన అభిమానం చాటుకున్నారు. గొల్లలకోడేరు గ్రామానికి చెందిన శ్రీనివాస్ వర్మ కాకినాడలోని కోరమండల్ ఫెర్టిలైజర్స్‌లో మెకానికల్ మేనేజర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈయనకు తెలుగు దేశం పార్టీ అన్నా చంద్రబాబు నాయుడన్నా ఎంతో అభిమానం. పదవీ విరమణ చేసినప్పటికి నుంచి తెలుగుదేశం మీద అభిమానంతో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పని చేస్తూ వస్తున్నారు. దీనిలో భాగంగానే ఎవరెస్టు శిఖరంపై తెలుగుదేశం జెండాను రెపరెపలాడించాలన్నదే ఈయన కోరిక. దీంతో అక్టోబరు 22న ఎవరెస్ట్ శిఖరం ఎక్కేందుకు సిద్ధపడ్డారు. 9 రోజులపాటు ట్రెక్కింగ్ చేసి 16 వేల అడుగులపైన ఉన్న ఎవరెస్ట్ బేస్ క్యాంపు వద్దకు చేరారు. అక్కడ టీడీపీ జెండాను ఎగురవేసి తన కోరిక తీర్చుకున్నారు. అనంతరం మరో నాలుగు రోజులపాటు ప్రయాణించి నవంబరు 3న కిందకు దిగారు. తనకు సాహసాలు చేయడమంటే ఎంతో ఇష్టమని తెలిపారు. వర్మను గ్రామస్థులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.



ఎవరెస్ట్ శిఖరంపై తెలుగుదేశం జెండా రెపరెపలాడించిన శ్రీనివాస్ వర్మ

అబ్బురపరిచిన మాల్కంబ్, రోప్ స్కిప్పింగ్



భీమవరం అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యతోపా టు వివిధ క్రీడల్లో సాధన ద్వారా బాలబాలికలు విజయం సాధించాలని స్కూల్ గేమ్స్ జిల్లా చైర్మన్, జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. శుక్రవారం చింతలపాటి బాపి రాజు స్మారక ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన 68వ ఆంధ్రప్రదేశ్ అండర్-14, అండర్ 17 అండర్-19 అంతర్ జిల్లాల మాల్కంబ్ రోప్ స్కిప్పింగ్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 600 మందికిపైగా క్రీడాకారులు వచ్చారరన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు తమ ప్రదర్శనలద్వారా అబ్బురపరిచారు.

యూనివర్శిటీ బ్యాడ్మింటన్‌కు ఏడుగురు విద్యార్థినులు ఎంపిక

పాలకొల్లు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు డీఎస్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యూనిర్శిటీ స్థాయి బాలికల బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. పోటీల్లో ప్రథమస్థానం ప్రభుత్వ కళాశాల రాజమండ్రి (ఎ)కు లభించింది. ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల (తణుకు) ద్వితీయ, సీఆర్ రెడ్డి కళాశాల (ఏలూరు) తృతీయ స్థానాలు దక్కించుకున్నాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ ప్రకటించారు. విజేత లకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియేల్, బహుమతులు అందించారు. యూనివర్శిటీ స్థాయి బ్యాడ్మింటన్ జట్టుకు అంజ నీదేవి, సాయిరత్న, రేణుశ్రీ, నాగ దుర్గాభవానీ, యమునా పద్మావతి, స్టాండ్‌బై ప్లేయర్సుగా నాగలక్ష్మీ, శ్రేయలను ఎంపిక కమిటీ పరిశీలకురాలు రత్నకుమారి, సుమతి ఎంపిక చేశారు. ఈ నెల 29న కర్నాటకలో జరిగే సౌత్ జోన్ టోర్నమెంట్‌లో నన్నయ్య యూనివర్శిటీ తరపున పాల్గొంటారని తెలిపారు.



బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో డీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి తదితరులు

కవ్వింపు.. కథేంటి !





అవిశ్వాసం పెడతామంటూ జడ్పీటీసీల బెదిరింపులు

ఉమ్మడి జడ్పీలో కొత్త కూని రాగాలు

పదేపదే సమావేశాలతో మాజీలంతా హడావుడి

సజావుగా జడ్పీ సాగకూడదనే ఆ పార్టీ ఎత్తుగడ

భయపడేది లేదంటున్న చైర్‌పర్సన్ పద్మశ్రీ వర్గం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ దంపతులపై వైసీపీ పదేపదే కవ్వింపులకు దిగుతున్నది. తమ పార్టీని వీడి తెలుగుదేశంలో చేర డమే ఈ దంపతులు చేసిన ప్రధాన తప్పు. నిబంధనలు పక్కాగా ఉన్నా వీటిని ఏమార్చి పదేపదే అవిశ్వాసం పెడతామంటూ బెదిరింపులు. వైసీపీ మాజీ ఎమ్మెల్యేలంతా తమ పార్టీ జడ్పీటీసీలతో సమావేశమవుతూ జడ్పీ చైర్మన్ వ్యవహారం తేల్చాల్సిందేనని మొండి పట్టుదలతో ఉన్నారు. దీనివెనుక వైసీపీ నాయకత్వ డైరెక్షన్ లేకపోలేదు. జిల్లా పరిషత్‌లో తమ పార్టీకి బలం ఉన్నా అవిశ్వాసం నోటీసు ఇవ్వలేమన్న సత్యాన్ని ఆ పార్టీ గ్రహించలేకపోతోంది.

ఎందుకీ సాధింపు

ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ సభ్యురాలిగా పెదపాడు నుంచి నిలిచిన ఘంటా పద్మశ్రీ కొన్ని రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. వైసీపీ రాజకీయ వ్యవహారాలు సరిపడక తన భర్త ప్రసాదరావుతో కలిసి టీడీపీవైపు మొగ్గారు. దీంతో వైసీపీ నాయకత్వం ఏదోరకంగా వారిని తిరిగి తమ పార్టీలోకి వచ్చేవిధంగా రకరకాల ఎత్తుగడలు వేశారు." సీరియస్‌గా ఆలోచించండి.. తగు రీతిలో మిమ్మల్ని కూర్చోబెడతామంటూ" ఆఫర్లు ఇచ్చారు. "అన్నీ ఆలోచించే టీడీపీలో చేరాం. ఇకముందు ఈ నిర్ణయాన్ని పునః సమీక్షించే ప్రసక్తేలేదని" ప్రసాదరావు దంపతులు వైసీపీ నేతలకు తేల్చిచెప్పారు. ఉమ్మడి పశ్చిమజిల్లా పరిషత్‌లో వైసీపీకి తిరుగులేని బలం ఉంది. కేవలం వీరవాసరం, ఆచంట స్థానాలను జనసేన, టీడీపీలు నిలబెట్టుకోగా మిగతా 46 జడ్పీటీసీ స్థానాల్లో వైసీపీనే గెలిచింది. ఈ నేపథ్యంలో తమ పార్టీని కాదని మీరెలా జడ్పీలో పాలన చేస్తారో చూస్తామన్నట్టుగా ఆదిలోనే పద్మశ్రీ దంపతులకు అడ్డు తగిలేందుకు వ్యూహాలు పన్నారు. ఇప్పటికి ఐదుసార్లు జడ్పీటీసీలు, వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఇంతకుముందు పార్టీలోను అప్పటి సీఎం జగన్‌కు అత్యంత ఇష్టుడైన ప్రసాదరావు సైతం పార్టీని వీడడంతో మున్ముందు ఆయన దూకుడుగా ముందుకు వెళ్ళకుండా అడ్డుకునే దిశగానే ఆటంకాలు సృష్టించేందుకు సిద్ధమయ్యారన్నది ఇంకొందరి వాదన. తొలుత చైర్‌పర్సన్ పద్మశ్రీ జనసేనలోకి వెళ్ళాలనుకున్నా ఆ నిర్ణయాన్ని మార్చుకుని తన భర్త ప్రసాదరావుతో కలిసి టీడీపీలో చేరారు. ఘంటా ప్రసాదరావుతో వైరుధ్యం ఉన్న ఒక మాజీ ఎమ్మెల్యే కూడా పట్టుబట్టి మరీ ఈ తతంగాన్నంతా నడిపిస్తున్నట్టు భావి స్తున్నారు. మండలాల వారీగా పార్టీని బలోపేతం చేసే క్రమంలో ఇంతకుముందు ప్రసాదరావు కీలకంగా వ్యవహరించడంతో అప్పట్లో కొందరికి నచ్చలేదు. దీనిని ఇప్పుడు కొందరు సాకుగా తీసుకుని కథ నడుపుతున్నట్టు భావిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం జడ్పీటీసీలు జిల్లా పరిషత్ అతిథి గృహంలో సమావేశమయ్యారు. అప్పటికప్పుడు ప్రత్యేక సమావేశం పెట్టాలని జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారావుకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ పద్మశ్రీని కలిసేందుకు విశ్వప్రయత్నం చేశారు.

ఆది నుంచి ఎకసెక్కాలే :

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కౌరు శ్రీనివాస్ కొనసాగినప్పుడు, తిరిగి ఆయన స్థానంలో ఘంటా పద్మశ్రీ ప్రవేశించినప్పుడు జిల్లా పరిషత్‌లో వైసీపీ ఎన్నడూ క్రియాశీలకంగా లేదు. స్థాయీ సంఘాలకు అత్యధిక సభ్యులు డుమ్మాలు కొట్టేవారు. వారి బాటలోనే అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రవర్తించేవారు. ఏ సమస్య వచ్చినా తమకు పట్టనట్టే మంత్రులు, ఎమ్మెల్యేలు, వారితోపాటు కొందరు సభ్యులు కూడా తేలిగ్గా తీసుకుని వ్యవహరించారన్న విమర్శ లేకపోలేదు. అధికారంలో ఉండి జిల్లాకు ప్రత్యేకించి నిధులు రాబట్టే ప్రయత్నమూ అప్పట్లో జరగలేదు.

బలం చూసుకునే బరితెగింపా

వాస్తవానికి జిల్లా పరిషత్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరాలనుకున్నా లేదా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలనుకున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ పంచాయతీరాజ్ స్థానిక సంస్థల నిబంధనల ప్రకారమే ఎవరైనా నడుచుకోవాల్సి ఉంది. కాని వైసీపీ మాత్రం పదేపదే చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై అవిశ్వాసం ప్రవేశపెడతామంటూ హడావుడి చేస్తున్నారు. మా బలం ఏమిటో చూపిస్తామంటూ రెచ్చిపోతున్నారు. వాస్తవానికి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటే మరికొందరు జడ్పీటీసీలు తెలుగుదేశం, జనసేనల్లో చేరాల్సి ఉన్నప్పటికి కొద్దికాలం పోయిన తరువాత వ్యవహారమేదో చూద్దామని టీడీపీ, జనసేన నాయకత్వాలు చేరికలను వాయిదా వేశాయి. అయితే ఇప్పుడు వైసీపీ చేస్తున్నట్టుగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన చెల్లుతుందా, లేదా అనేది మాత్రం ఆ పార్టీ పట్టించుకోవడం లేదు. జిల్లా పరిషత్‌లో చైర్‌పర్సన్‌గా ఎవరున్నా సదరు వ్యక్తి వరుసగా నాలుగేళ్ళ పాటు ఆ పదవిలో కొనసాగిన తరువాత మాత్రమే అవిశ్వాస తీర్మానం పెట్టడానికి మిగతా సభ్యులకు వెసులుబాటు. ఇదే విషయాన్ని జీవో 244లోను స్పష్టంగా ఉంది. ఘంటా పద్మశ్రీ కేవలం చైర్‌పర్సన్‌గా ఇప్పటికి 15 నెలలు అయింది. అలాంటప్పుడు ఆమెపై ఎలా అవిశ్వాస తీర్మానం పెడతారో వైసీపీకే తెలియాలంటూ కొందరు ప్రశ్న లేవనెత్తుతున్నారు. దీనికితోడు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఎంతమంది సభ్యులు ఉన్నారనే దానిపైనా ఇప్పటికీ స్పష్టత లేదు. ఆమెకు వ్యతిరేకంగా 31 మంది ఉన్నారని వైసీపీ 'షో' చేస్తున్నది. అసలు అవిశ్వాస తీర్మానానికి అవకాశమేలేని పరిస్థితుల్లో ఇలాంటి రాద్ధాంతానికి దిగడం విచిత్రం. ఈనెల 11న జరగనున్న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంలోను ఈ తీర్మానం ప్రవేశపెట్టాలని వైసీపీ తహతహలాడుతోంది.

జనం కోసమే మేము : ఘంటా పద్మశ్రీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

ప్రజాసేవ చేయాలనుకునే రాజకీయాల్లోకి వచ్చాం. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూడా ఇదే విధానాన్ని పాటిస్తున్నాం. మాకు కావా ల్సింది ప్రజల బాగోగులే. జిల్లా పరిషత్‌కు నియమ నిబంధనలు ఉన్నాయి. ఎవ్వరైనా గీత దాటాలనుకున్నా కుదరదు. కేవలం భయ పెట్టి లబ్ధి పొందాలనుకుంటున్న కొందరి ప్రయత్నాలకు మేమేమీ బెదరం. పార్టీ నిర్ణయాలకు అనుగుణంగానే నడుచుకుంటాం.

స్థాయి సంఘ సమావేశాలు వాయిదా

వైసీపీ జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరు

ఏలూరుసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు సభ్యుల కోరం లేక వాయిదా పడ్డాయి. ఏలూరు జడ్పీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాలు నిర్వహించా లని నిర్ణయించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఉదయం పది గంటలకే సమావేశానికి విచ్చేశారు. పలు శాఖల ఉన్నతాధికారులు వచ్చారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 48 మంది జడ్పీటీసీ సభ్య లుండగా వీరిలో 46 మంది వైసీపీకి చెందిన వారు. ఆచంట జడ్పీటీసీ టీడీపీ సభ్యుడు కాగా, వీరవాసరం జడ్పీటీసీ జనసేనకు చెందిన వారు ఉన్నారు. సమావేశాలకు వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. సభ్యుల కోరం లేక పోవడంతో జడ్పీ స్థాయి సంఘ సమావేశాలను వాయిదా వేస్తున్నట్టు జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు.

11న జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ఏలూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై పార్టీ ఫిరాయింపులు చట్టం ప్రకారం ఈనెల 11న జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతున్నట్టు జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు తెలిపారు. శుక్రవారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాలను వైసీపీ జడ్పీటీసీలు 37 మంది బాయ్‌కాట్ చేశారు. ఆయా నియో జకవర్గాల ఇన్‌ఛార్జ్‌లతో దూలం నాగేశ్వరరావు అధ్యక్షతన జడ్పీ టీసీలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో విజయ్‌బాబు మాట్లాడుతూ ఇటీవల గంటా పద్మశ్రీ టీడీపీలో చేరారని వైసీపీ విప్ ధిక్కరించారని, పంచాయతీరాజ్ చట్టాన్ని అతిక్రమించి పార్టీ ఫిరాయించారన్నారు. తామంతా జడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి తీర్మానించామన్నారు. సమావేశంలో ఆయా మండలాల జడ్పీటీసీలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాద్‌రాజు, కొటారు అబ్బయ్యచౌదరి, బాలరాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో జడ్పీచైర్మన్, ఉద్యోగులు

ఇక నాన్-రెసిడెన్షియల్ పద్ధతిలోనే
టీచర్లకు శిక్షణలు

సోమవారం నుంచి శుక్రవారం వరకు బోధన


శిక్షణలకు శనివారం పరిమితం

» ఉపాధ్యాయ సంఘాల నాయకులతో చర్చల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు ఇక మీదట ఇచ్చే శిక్షణల న్నింటినీ నాన్-రెసిడెన్షియల్ పద్ధతిలోనే ఆయా జిల్లాలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పాఠశాలవిద్య కమిషనర్ విజయరామ రాజు నేతృత్వంలోని ఉన్నతాధికారులు అంగీకరించారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం విజయవాడలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఉన్నతాధికారులు నిర్వహించిన సమావేశంలో చర్చించిన విషయాలు, వాటిపై అధికారుల హామీలు, నిర్ణయాలను విలేకరులకు తెలిపారు. టీచర్ల నియామకాలకు, పదోన్నతులకు ఒకే విధమైన విద్యార్హతలను ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు అమలు చేయాలని కోరగా అంగీకరించారని వివరించారు. జీవో 117 ఉత్తర్వుల రద్దు అనంతరం అమలు చేయాల్సిన విధానంపై ఉపాధ్యాయ సంఘాలనుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా రెండు వారాల్లోగా ముసాయిదా ఉత్తర్వులను విడుదల చేస్తారని తెలిపారు. 6, 7, 8వ తరగతుల్లో 60 మందికిపైగా విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్ళుగా అప్‌గ్రేడ్ చేయడానికి అంగీకరించారని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26)నుంచి సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయడానికి హామీ ఇచ్చారని, శిక్షణ కార్యక్రమాలు ఏమైనా ఉంటే శనివారం మాత్రమే నిర్వహిస్తారని తెలిపారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన అన్ని నిర్ణయాలు, నిబంధనలు, సీనియార్టీ జాబితా లను రెండు, మూడు నెలల్లో తుదిరూపు ఇస్తామని ఉన్నతాధికారులు చెప్పారన్నారు. ఈ ఏడాది ఇప్పటికే పని సర్దుబాటు ప్రక్రియ పూర్తయినందున ఎక్కడైనా సబ్జెక్టు టీచర్ల కొరత ఉంటే ఈనెల పదో తేదీ నుంచి పన్నెండో తేదీలోపు వివరాలు తెప్పించుకుని సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. సమావేశంలో విద్యాశాఖ తరఫున డైరెక్టర్ పి.పార్వతి, సమగ్రశిక్షా సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ శ్రీనువాసులరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు అబ్రహం, శైలజ తదితరులు పాల్గొన్నారు

డిసెంబరు 4న 'పరాఖ్' పరీక్ష

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పాఠశాలల విద్యార్థులకు డిసెంబరు 4న 'పరాఖ్' జాతీయ స్థాయి మదింపు పరీక్ష (ఎన్‌ఏఎస్)ను నిర్వహించనున్నారు. వివరాలను డీఈవో వెంకటలక్ష్మమ్మ, జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ (డీసీఈబీ) కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు తెలిపారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షను ఏలూరు జిల్లాలో 133 పాఠశాలల్లో నిర్వహించాలని నిర్ణయించామన్నారు. మూడోతరగతి విద్యార్థులకు 49 స్కూళ్ళలో, 6వతరగతికి 39 స్కూళ్ళు, 9వతరగతికి 45 స్కూళ్ళను ఎంపిక చేశామని వివరించారు. లాంగ్వేజి, గణితం, జనరల్ నాలెడ్జి సబ్జెక్టుల్లో పరీక్ష ఉంటుందన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్‌గా డీఈవో, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్‌గా డీసీఈబీ సెక్రటరీ వ్యవహరిస్తారని తెలిపారు.


నరసాపురంలో గోదావరి వద్ద కంపోస్టు యార్డు

గోదావరిలో తేలిన చేపలు(ఫైల్)

పేరుకుపోయిన చెత్తా చెదారం (ఫైల్)

కాలుష్య కోరల్లో
వశిష్ఠ గోదావరి

కలుషితంపై 'ఎన్జీటీ' ఆగ్రహం

» నివేదిక అందించాలని మూడు సంస్థల సంయుక్త కమిటీకి ఆదేశం

నరసాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వశిష్ఠా గోదావరి కాలుష్య కోరల్లో చిక్కుకుంది. చెత్తా, చెదారంతో పాటు ఆక్వా చెరువుల కలుషిత నీరు, కంపెనీలు విడిచిపెట్టే వ్యర్థాలు, పరిశ్రమల రసాయనాలు పవిత్రమైన నదీజలాల్లో కలుస్తున్నాయి. గోదావరి ఒడ్డునే పురపాలక సంఘం కంపోస్టుయార్డు నిర్వహిస్తుంది. దాదాపు ఆరు వేల టన్నుల చెత్త పేరుకుపోయింది. ఈకారణంగా నీరు కలుషితమై మత్స్య సంపద హరించిపోతుంది, కొన్ని సమయాల్లో రసాయనాలకు మత్స్య సంపద చనిపోయి నీటిపై తేలియాడు తున్నాయి. ఇటువంటి ఘటనలు గతంలో అనేకం జరిగాయి. అయినప్పటికీ కాలుష్య బోర్డు నిర్లక్ష్య ధోరణి మారలేదు, వ్యర్థాలను గోదావరిలో కలవకుండా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు లేకపోలేదు. గతంలోనే కంపోస్టుయార్డు తొలగించమని కేంద్ర కాలుష్య బోర్డు పురపాలక సంఘానికి ఆదేశాలు ఇచ్చింది. నేటికీ స్థలం దొరకలేదు. కోస్టల్ కారిడార్ నిబంధనలకు విరు ద్ధంగా వశిష్ఠా గోదావరిలో వ్యర్థాలు తీరానికి చేరుతున్నాయని ఎన్జీటీలో (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్)లో దాఖలైన పిటీషన్‌పై ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

ప్రారంభం కాని గోదావరి ప్రక్షాళన

వశిష్ఠ గోదావరి విజ్జేశ్వరం వద్ద పాయగా వీడి సిద్ధాంతం, ఆచంట, యలమంచిలి, నరసాపురం మీదుగా ప్రవహించి మండలంలోని బియ్యపుతిప్పకు అర కిలోమీటరు దూరంలో బంగాళాఖాతంలో కలుస్తోంది. ఈ ప్రదేశాన్ని అన్నచెల్లెల గట్టు అని పిలుస్తారు, సముద్ర ఆటుపోటులకు అలల ప్రభావం గోదావరిపై ఎక్కువగా పడుతుంది. ఈ కారణంగా దొడ్డిపట్ల వరకు నీటిలో ఉప్పుశాతం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రభావం కోనసీమ జిల్లా రాజోలు వరకు కనిపిస్తుంది. గతంలో కేంద్రం గోదావరి ప్రక్షాళన చేస్తామని ప్రకటించింది. కానీ ఆ ప్రక్రియ ఇంత వరకు ప్రారంభానికి నోచుకోలేదు.

రెండు నెలల్లో నివేదిక అందించాలి

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, కోస్టల్ జోన్ మేనేజిమెంట్ అథారిటీ, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల ఆధ్వర్యంలో సంయుక్త కమిటీని ఏర్పాటు చేసి రెండు నెలల్లో నివేదికను అందించాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారయంత్రాంగం ఉలిక్కిపడింది. దేశవ్యాప్తంగా అనేక నదులు ఉన్నప్పటికీ ఒక్క వశిష్ఠ గోదావరిపై దాఖలైన రిపోర్టులోని ప్రమాదకరమైన వ్యర్థాలు, రసాయనాల వల్లే ట్రిబ్యునల్ ఈ విధమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేసి ఉండవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై అధికారులెవ్వరూ నోరు మెదపడం లేదు. ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా నివారణ చర్యలు చేపడతామంటూ దాటవేస్తారు.

కలుషితం ఈవిధంగా..

గత ఇరవై ఏళ్ళ నుంచి గోదావరి పరీవాహక ప్రాంతంలో ఆక్వా చెరువుల సాగు సంఖ్య ఎక్కువగా సాగుతోంది. చించినాడ, యలమంచిలి, నరసాపురం మండలంలోని అనేక ప్రాంతాల్లో గోదావరికి ఆనుకునే రొయ్యల సాగులు జరుగుతున్నాయి. చెరువులకు వాడే మందులు, మత్స్య సంపదకు వాడిన ఫీడ్ నీటిని గోదావరిలోకే విడిచిపెడుతున్నారు. సాధారణంగా నదీ ప్రవాహానికి 50 మీటర్ల వరకు సీఆర్‌జడ్ పరిధి ఉంటుంది. జిల్లాలో ఎక్కడా ఈ నిబంధన పాటించడం లేదు. నదీ ప్రవాహానికి పది మీటర్ల దూరంలోనే పెద్దపెద్ద భవనాలు నిర్మిస్తున్నారు. సాగు చేసే చెరువులన్ని జిరాయితీ భూమిగా చూపిస్తున్నారు. ఈ భూములు సాగుకు పనికిరావు, ఈ కారణంగా రొయ్యలు, చేపల చెరువులే ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇటు గోదావరి నదికి సమీపంలో నివాసాలు ఉంటున్న చాలామంది డ్రైనేజీల నీటిని గోదావరిలోకి విడిచిపెడుతున్నారు. వీటికి తోడు కోనసీమ జిల్లాలోని కొన్ని గ్రామాలు చెత్తా, ఇతర వ్యర్థాలను గోదావరిలోనే పడేస్తున్నారు. కొన్ని నది ఒడ్డునే నరసాపురం పురపాలక సంఘం వారే కంపోస్టుయార్డును నిర్వహించి చెత్తా, చెదారాన్ని ఒడ్డునే పడేస్తున్నారు. ఇవికాకుండా కొన్ని కార్పొరేట్ కంపెనీలు గోదావరి పరివాహక ప్రాంతాల్లోనే ఆక్వా ప్రాసెసింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని వ్యర్థాలు, వాడిన రసాయనాలను నిబంధనలను అతిక్రమించి నదిల్లోకి విడిచిపెడుతున్నారు. కొన్ని కంపెనీలు పేరుకు రీసైక్లింగ్ యూనిట్లు పెట్టి వాటిని వినియోగించకుండా రాత్రి సమయాల్లో వ్యర్థనీటిని గోదావరిలోకే పంపేస్తున్నారు. ఈ కారణంగా పవిత్ర నది నిత్యం కలుషితమవుతుంది. ఇదే విధంగా కొనసాగితే కొన్నేళ్ళకు యనమదుర్రు డ్రెయినేజీగా మారే ప్రమాదం ఉందన్న వాదనలు లేకపోలేదు.

అనేక సార్లు ఉద్యమం

కంపోస్టు యార్డును తొలగించమని ఎన్నో ఏళ్లుగా ఉద్యమం చేస్తున్నాం. గోదావరి ఒడ్డునే పెట్టడం వల్ల నదీ జలాలు కలుషితం అవుతున్నాయి. ఇవి కాకుండా పరిసర ప్రాంతాలకు వచ్చే దుర్భర వాసనకు అంటు రోగాలు వస్తున్నాయి. కొన్ని సమయాల్లో ఈగలు ముసిరేస్తున్నాయి. ప్లాస్టిక్ వంటి సంచులను భారీ చేపలు తినడం వల్ల మృత్యువాత పడుతున్నాయి. సముద్రం, నదిలో కొన్ని రకాల మత్స్య సంపద కూడా కనిపించడం లేదు.



\- పెమ్మాడి శ్రీదేవి, మాజీ కౌన్సిలర్

అయినా తీరు మారలేదు..

యథేచ్ఛగా ఇసుక దందా

» సీఎం చంద్రబాబు హెచ్చరికలు బేఖాతరు

» పట్టించుకోని సంబంధిత అధికారులు

» క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న ఇసుక దోపిడీ

పాలకొల్లు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉచిత ఇసుక విధానం అబాసు పాలు అవుతూనే ఉంది. రాష్ట్ర ప్రజలకు సహజవనరు ఇసుక ఉచితంగా ఇవ్వాలని సీఎం చంద్రబాబు ధృడ సంకల్పంతోనే ఉన్నప్పటికి క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోవడం లేదు. అన్ని ఖర్చులు మినహాయించి కేవలం లోడింగ్ ఛార్జీతో మాత్రమే అందించాలనేది ప్రభుత్వ ఉద్దేశ్యం. అయితే జగన్ రెడ్డి పాలనను తలపిస్తూ పలువురు నేతలు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఇసుక అమ్మకం ద్వారా ఎడాపెడా దోచేస్తున్నారు. శుక్రవారం పెండ్యాల వద్ద ర్యాంపులో బాటలు వేసి ఇసుక ఎగుమతులు ప్రారంభించారు. రూ.1500లకు రశీదు ఇస్తూ అదనగాఅ రూ.5వేలు వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీలో సైతం స్థానిక లారీలకు ప్రాధాన్య తిస్తున్నారు. ఔరంగాబాద్, వాడపల్లి, కొవ్వూరు, ఇంకా పలు ర్యాంపులలో పడవల ద్వారా సేకరించిన ఇసుకను ఐదు యూనిట్లు లారీకి రూ.4580 రశీదు ఇచ్చి, మరో రూ.5 వేలు దోచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం సుమారు రోజుకి 300 లారీలు ఇసుక ఎగుమతి అవుతుంది. లారీకి రూ.5వేలు అక్రమంగా వసూలు చేస్తున్న మొత్తం రోజుకు రూ.15లక్షలు ఉంటుందని అంచనా.

పట్టించుకోని అధికారులు

ఇసుక అమ్మకాలలో పారదర్శకత లోపించి ర్యాంపులలో దళారులు ప్రవేశించి నేరుగా దోపిడీ చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు అధికార పార్టీ నాయకులు కనుసన్నలలోనే దోపిడీ జరుగుతుందని విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే విధంగా అధికారపార్టీలోని కొందరు వ్యవహరిస్తున్న తీరుపై కూటమి శ్రేణులలోనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదేవిధానం కొనసాగితే ప్రభుత్వ పరువు గంగ పాలవుతుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. వాస్తవ ధరకు వినియోగదారులకు ఇసుకను అందిస్తే పెండ్యాల వంటి ర్యాంపులలో రూ.



1500, లారీ కిరాయి దూరాన్ని బట్టి రూ. 4 నుంచి రూ.6 వేలు మొత్తం రూ.8వేలు లోపే వినియోగదారులకు చేరుతుంది. ఇప్పుడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలలో ఆయా ప్రాంతాలలో ఐదు యూనిట్ల ఇసుక రూ. 20 వేలు నుంచి 25వేలకు అమ్ముతున్నారు. ఇసుక ఎగుమతులలో అక్రమ వసూళ్ళకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వ క్షేత్రస్థాయిలో అధికారులను ఏర్పాటు చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని ఇసుక కొనుగోలుదారులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అధికారులు

» జగన్నాథపురంలో కోర్టు స్టేటస్ కో ఇచ్చినా రాత్రి వేళల్లో నిర్మాణం

» నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జగన్నాథపురంలో జిల్లా పరిషత్ భూముల్లో అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని అధికారులు అడ్డుకున్నారు. 2021లో పేదలకు ఇళ్ల ఇచ్చేందుకు కేటాయించిన స్థలంపై తమదంటూ కోర్టుకు వెళ్లిన భూములపై కోర్టు అప్పట్లో స్టేటస్ కో ఇవ్వగా ఆ భూముల్లోనే గత ఏడాదిగా చుట్టూ క్లాత్ కట్టి రాత్రి సమయంలో సుమారు పది సెంట్ల భూమిలో నిర్మాణం చేపట్టినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనానికి స్లాబు వేసేందుకు నిర్మాణ దారుడు పూనుకోగా పంచాయితీ అధికారులు ఆ పనులు అడ్డుకుని పనులు చేయవద్దని సూచించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ జడ్పీ భూములు పరిరక్షించాలని, ఆ విధులు నిర్వహించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్నారని నిర్మాణదారుడిపై చర్యలు తీసుకోవాలని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.


సెంట్రింగ్ కర్రలు వేసిన భవన నిర్మాణం



నేరేడిమిల్లిలో కొబ్బరిలో పోషక యాజమాన్యంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొబ్బరి తెగుళ్లపై శాస్త్రవేత్తల పరిశీలన

ఉండి/యలమంచిలి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నల్లముట్టె పురుగు ఆశిస్తే కొబ్బరి ఆకులు ఎండిపోయి వాలిపోతాయని, దూరం నుంచి చూసినపుడు తోట అంతా కాలిపోయినట్లు కనిపిస్తుందని అంబాజీపేట, ఉండి కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. శుక్రవారం ఉండి, అంబాజీపేట సంయుక్త ఆధ్వర్యంలో యలమంచిలి మండలం నేరేడుమిల్లి వెళ్లి కొబ్బరితోటలను పరిశీలించి కొబ్బరిలో తెగుళ్ల ఆశించే పురుగులు.. పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. ఉండి కేవీకే ప్రోగ్రాం హెడ్ డాక్టర్ ఎస్. మల్లికార్జున రావు, అంబాజీపేట శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు మాట్లాడుతూ కొబ్బరిలో బోరాన్ లోపాలను గుర్తించి ఒక్కొక్క కొబ్బరి మొక్కకు ఇతర పోషకాలతో బోరాన్ వంద గ్రాములు అందించాలని తెలిపారు. నల్లముట్టె పురుగు ఆశించడం వల్ల కాపు తగ్గడమే కాక కొబ్బరి కాయ పరిమాణం తగ్గిపోతుందని, కొబ్బరి పిందెలు రాలిపోతాయని దీని నివారణకు రైతులంతా సామూహికంగా జీవ నియంత్రణ పద్దతులను పాటించి నియంత్రించవచ్చన్నారు. డాక్టర్ వి.అనూష మాట్లాడుతూ పురుగు ఆశించి ఎండిన అడుగు వరుస ఆకులను తీసి కాల్చాలని, నల్లముట్టె పురుగు 2,3 దశలలో తక్కువ స్థాయిలో వున్నపుడు అంటే చెట్టుకు ఒకటి లేక రెండు ఆకులకు ఆశించినట్టయితే మిత్ర పురుగును చెట్టుకు 30 చొప్పున వదలాలన్నారు. డాక్టర్ పి.వినయలక్ష్మి, ఆర్. దేవానంద్‌కుమార్, ఏవో సీహెచ్ దేవి, హార్టీకల్చరల్ అసిస్టెంట్ స్వప్న, రైతులు చిలుకూరి బేబీరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాతా,శిశు మరణాలు నూరుశాతం నియంత్రించాలి

భీమవరం టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మాతా, శిశు మరణాలు నూరుశాతం నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లను క్రమం తప్పకుండా పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఇటువంటి సంఘటనలు ప్రోత్సహించినా, పరీక్షలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. ఆడపిల్లలు నిష్పత్తి తక్కువగా ఉన్న గ్రామాలలో ప్రత్యేక నిఘా పెట్టి, అక్కడ వారికి అవగాహన కల్పించి బాలికల నిష్పత్తిని పెంచాలన్నారు. సంతాన ఉత్పత్తి సాఫల్య కేంద్రాలపై తనిఖీలు చేసి, రికార్డులను అధ్యయనం చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా నలుగురు అల్ట్రా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోగా, భీమవరం, పాలకొల్లు, తణుకు, నరసాపురం స్కానింగ్ సెంటర్లను ఆమోదించారు.

వీఆర్వోలపై ఒత్తిడి తగదు

ఏలూరు రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చేసే ప్రతిపనిని వీఆర్వోలతో చేయించడం వల్ల ఒత్తిడికి గురవుతున్నారని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం నిర్వహించినా గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది చేయాలని ఆదేశాలు జారీచేస్తే వాటిలో వీఆర్వోలను భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. గతంలో వలంటీర్లు చేసే ప్రతిపని వీఆర్వోలు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. భవిష్యత్‌లో అనేక ఇబ్బందులకు గురవుతామన్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ సంబంధం లేని ఇతర విధుల్లో వీఆర్వోలను నియమించవద్దని సీసీఎల్ఏ ఆదేశాల మేరకు అన్నిస్థాయి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించి త్వరలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

న్యాయవాది అరెస్టు

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహితను వేధింపులకు గురి చేస్తున్న న్యాయవాది బెయిల్ పొంది ఆపై కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్‌తో అతడిని ఏలూరు వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. పెదవేగి మండలం కొండలరావు గ్రామానికి చెందిన ఆళ్ళ సత్యనారాయణ ఏలూరు బార్‌లో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. ఏలూరులోని ఒక ప్రాంతానికి చెందిన వివాహిత మొబైల్‌కు 2021లో అసభ్యకరమైన మెస్సేజ్‌లు పెట్టాడు. ఆ వివాహిత భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు 2021 ఏప్రిల్ 10వ తేదీన అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. బెయిల్ పొందిన అతడు కోర్టు వాయిదాలకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ కోర్టు జారీ చేసింది. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు అతడి ఆచూకీ కనుగొని శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

క్రైమ్ కార్నర్


వాహనం ఢీకొని బాలుడి మృతి

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుణ్ణంపల్లి జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని బైక్ నడుపుతున్న ఓ బాలుడు మృతి చెందాడు. దేవినేనివారి గూడెంకు చెందిన తనగల ప్రవీణ్(17) తన బైక్‌పై గుణ్ణంపల్లి పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ పోయించుకున్నాడు. స్వగ్రామానికి తిరుగు ప్రయాణంలో ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి డివైడర్ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్రగాయాలపాలైన బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రవీణ్ మృతదేహం

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరి మృతి

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అతివేగంగా, నిర్లక్ష్యంగా వెళ్తున్న ఓ కారు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొట్టడంతో అతడు తీవ్రగాయల పాలై చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తిమ్మాపురం వద్ద జరిగింది. గ్రామానికి చెందిన ఇందేటి వెంకటేష్(58) బుధవారం సాయంత్రం స్థానిక పెట్రోల్ బంక్ వద్దకు వెళ్తుండగా ద్వారకా తిరుమల నుంచి భీమడోలు వైపునకు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్రగాయలపాలైన అతడిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు మృతుడి కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.


వెంకటేష్ మృతదేహం

గ్యాస్ నొప్పితో రోడ్డుపై పడి వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేగవరం పొగాకు మొద్దుల ఫ్యాక్టరీ వద్ద తన భర్త ఉప్పల శ్రీనివాస్(47) రోడ్డుపై పడి గురువారం మృతి చెందాడని భార్య లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సీ ఎన్.ఉమామహేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపిన వివరాలివి.. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం చెందిన ఉప్పల శ్రీనివాస్ ఈనెల ఆరోతేదీన బైక్‌పై ఫైనాన్స్ నగదు చెల్లించడానికి జంగారెడ్డిగూడెం విచ్చేశాడు. అదే రోజు సాయంత్రం భార్యకు ఫోన్ చేసి ట్రాక్టర్ తీసుకు వచ్చేందుకు ఆలస్యం అవుతుందని ఇంటికి రావడం లేదని చెప్పాడు. తరువాత రోజు ఏడో తేదీ సాయంత్రం మృతుడు ఫోన్ నుంచి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి శ్రీనివాస్ గ్యాస్ నొప్పితో పడిపోయి మృతి చెందాడని తెలిపారు. వేగవరం పొగాకు మొద్దుల ఫ్యాక్టరీ వద్దకు మృతుడి భార్య తన కుమారుడితో వచ్చి చూడగా తన భర్త రోడ్డుపక్క మొక్కల్లో పడి చనిపోయి ఉన్నాడని తెలిపారు. తన భర్తకు గ్యాస్ నొప్పి వచ్చేదని ఆమె ఫిర్యాదులో పేర్కొందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

అత్తిలిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

అత్తిలి, నవంబరు 08 (ఆంధ్రజ్యోతి) : అత్తిలి రైల్వేస్టేషన్ వద్ద గుర్తుతెలియని సుమారు 35 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రైల్వే ట్రాక్‌పై ఉన్న విద్యుత్‌పోల్ ఎక్కి కొన్ని గంటల పాటు హల్‌చల్ చేసి చివరకు అదుపుతప్పి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం అత్తిలి రైల్వే స్టేషన్‌లో రైల్వేట్రాక్‌పై ఉన్న విద్యుత్ సరఫరా అయ్యే పోల్‌ను గుర్తుతెలియని వ్యక్తి ఎక్కాడు. ఆ వ్యక్తి తమిళం మాట్లాడినాడని స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి కిందకు రావాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ దిగలేదు. రాత్రి సమయంలో ఆ వ్యక్తి అదుపుతప్పి పట్టాలు పక్కన ఉన్న కంకర రాళ్లపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేస్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు ఆర్‌పీఎఫ్ పోలీసులు ఘటన ప్రదేశానికి వచ్చి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

ఉమ్మడి పశ్చిమలో ఎక్సైజ్ దాడులు

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేవీఎన్ ప్రభుకుమార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యలోఓ ఇన్‌స్పెక్టర్స్ ఫణికుమార్, భోగేశ్వరరావు, ఎస్ఐ రాజేంద్రప్రసాద్ వారి సిబ్బంది విస్తృతంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. టి.నర్సాపురం మండలం తిరుమల దేవిపేటలో బెల్టుషాపులపై దాడి చేసి తోట రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతడి వద్ద నుంచి 49 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పోతనపల్లి గ్రామ పంచాయతీ గంటిపాడు తండాకు చెందిన అషావత్తు చిన్నమ్మను అరెస్టు చేసి ఆమె నుంచి సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- చింతలపూడి : చింతలపూడి మండలం పంతంగులగూడెంలో ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సారా స్థావరంపై దాడులు జరిపి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని పొలంలో సారా తయారీకి నిల్వ ఉంచిన వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. పొలం యజమాని హెచ్. నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకన్న అనే ముగ్గురు పరారీలో ఉన్నారని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు ఆర్.వి. ఎల్.నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, ఎం.డి.ఆరీఫ్ పాల్గొన్నారు.
- జీలుగుమిల్లి : అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు అరెస్టు చేశారు. శుక్రవారం అంకన్నగూడెంలో దాడులు జరిపి ఓ వ్యక్తి వద్ద 40 తెలంగాణ మద్యం బాటిళ్లు, మరో వ్యక్తి వద్ద రాష్ట్రానికి చెందిన 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో ఎస్ఐ ఎస్ఎస్ఎస్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది ఉన్నారు.


తిరుమలదేవిపేటలో అరెస్టు చేసిన నిందితుడు.. మద్యం బాటిల్స్

- పెంటపాడు : పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామంలో అనధికారికంగా మద్యం అమ్ముతున్న కత్తుల రవి అనే వ్యక్తి చెందిన బెల్టుషాపుపై ఎస్ఐ స్వామి సిబ్బందితో దాడి చేశారు. దాడిలో రూ.4,070 విలువైన 180 ఎంఎల్ కల్గిన 34 మద్యం బాటిల్స్ సీజ్ చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.
- తాడేపల్లిగూడెం రూరల్ : రెండు వేర్వేరు చోట్ల అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై వేర్వేరు కేసులు నమోదుచేసి ఇద్దరిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ కళ్యాణచక్రవర్తి శుక్రవారం తెలిపారు. గణపవరం మండలం ఎస్. కొండేపాడులో సారా తయారీ కోసం ఉంచిన వంద లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని మార్కెట్ సమీపంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని ఆమె నుంచి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఈఎస్టీఎఫ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రమాదేవి, తాడేపల్లిగూడెం ఎస్ఐ మురళీమోహన్, దొరబాబు సిబ్బంది పాల్గొన్నారు.

25 కేజీల గంజాయి పట్టివేత.. ఐదుగురి అరెస్ట్

దెందులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి కలిగిన ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని దెందులూరు పోలీసులు తెలిపారు. దెందులూరు మండలంలో హైవేకి అతి సమీపంలోని సోమవరప్పాడు గ్రామ ద్వారకా ప్లాట్స్‌లలో శుక్రవారం రాత్రి నర్సీపట్నం నుంచి ప్యాసింజర్ల మాదిరిగా ఏలూరు తంగెళ్లమూడి, సోమవరప్పాడు గ్రామాలకు చెందిన ఐదుగురు వ్యక్తులు గంజాయి తీసుకుని వాటిని అమ్మేందుకు గంజాయిని విభజించుకుంటుండగా పోలీసులకు సమాచారం వచ్చింది. ఈమేరకు పెదవేగి సీఐ వెంకటేశ్వరావు, దెందులూరు ఎస్ఐ శివాజీ ప్లాట్స్ వద్ద దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఏలూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సావిత్రి

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ పి. సావిత్రి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ సావిత్రిని ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఆమె శుక్రవారం ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పలువురు హెచ్‌వోడీలు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు శుభాకాంక్షలు తెలిపారు.


డాక్టర్ సావిత్రి

'మా బ్రాంచిపై ఎటువంటి సోదాలు జరుగలేదు'

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న సేఫ్‌మాక్ సొసైటీ లిమిటెడ్ హెడ్ ఆఫీస్, బ్రాంచిలలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు కాని ఏ ఇతర ప్రభుత్వ శాఖ అధికారులు సోదాలు చేయలేదని ఆ సొసైటీకి సంబంధించిన అధీకృత అధికారి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరుకు చెందిన ప్రముఖ వ్యాపారి నూకల రామకృష్ణ ఇంటిపై ఆయనకు సంబంధించిన కార్యాలయాలపై మూడు రోజుల నుంచి తమిళనాడుకు చెందిన సెంట్రల్ ఇన్‌కమ్ టాక్స్ అధికారులు సోదాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సేఫ్‌మాక్ సొసైటీ లిమిటెడ్ బ్యాంక్ పైఅంతస్తులో ఉన్న నూకల రామకృష్ణకు చెందిన కార్యాలయాల్లో అధికారులు సోదాలు నిర్వహించారు. అయితే సోదాల సమయంలో ఆ ఆవరణ పరిసరాల్లో ఇన్‌కమ్ టాక్స్ అధికారులు, సీఐఎస్ఎఫ్ అధికారులు ఉండడంతో సొసైటీపై దాడులు జరిగినట్లు ప్రచారం సాగింది. ఈ ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని సేఫ్‌మాక్ సొసైటీ అధీకృత అధికారి తెలిపారు.

ఒంటరి మహిళను వేధిస్తున్న ఆరుగురిపై కేసు

ఉండి నవంబరు 8(ఆంధ్యజ్యోతి): ఒంటరి మహిళపై లైంగికంగా వేధిస్తూ.. చంపుతామని బెదిరిస్తున్న ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఉండి ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. శుక్రవారం ఉండి పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై ఇంటి పక్కనున్న తాడి యాకోబు అతడితో పాటు మరో ఐదుగురు కలిసి తరచూ వేధిస్తున్నారని, చంపుతామని బెదిరిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

జాతీయ రహదారి పరిధిలో పనులు చేపట్టండి

ఎంపీ మహేశ్ విజ్ఞప్తి

ఏలూరు టూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలోని జాతీయ రహదారి పరిధిలో సర్వీస్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, కల్వర్టు పనులు చేపట్టాలని కేంద్ర రోడ్ల రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఆయన కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు హైవేలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వలన చింతలపూడి, నూజివీడు, పోలవరం పరిధిలో రహదారులు దెబ్బతిన్నాయని ఈ రోడ్లను డబల్‌లైన్‌గా అభివృద్ధి చేయాలన్నారు.

బాల్యవివాహాల నిరోధానికి 112

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) బాల్యవివాహాల నిరోధంపై శుక్రవారం బాలల సంక్షేమ కమిటీ, ఐసీడీఎస్, పోలీసు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కన్వర్జెన్సీ మీటింగ్ జరిగింది. ఐసీడీఎస్ జిల్లా సీడీపీవో పద్మావతి బాల్య వివాహాల వల్ల అనర్థాలు వివరించారు. మహిళాపోలీసు స్టేషన్ ఎస్సై కాంతి ప్రియ మాట్లాడుతూ బాలికలు వేధింపులకు గురైతే 112 ఫోన్‌నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ పి.వెంకటేశ్వరరావు, కార్మికశాఖ అసిస్టెంట్ కమిషనర్ నాగేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్ ఆనంద్‌బాబు, రవిబాబు, వినోద్‌కుమార్, రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

అభయ యాప్‌పై అవగాహన

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకోసం పోలీసుశాఖ అందుబాటులోకి తెచ్చిన యాప్ వినియోగం, ఉపయోగాలపై శుక్రవారం గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో టూటౌన్ పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా ఎస్సై నాగకళ్యాణి మాట్లాడుతూ నేరప్రవృత్తిని నివారించే చర్యల్లో భాగంగా అభయ మహిళా భద్రత యాప్‌ను ప్రవేశపెట్టినట్టు వివరించారు. ఆపదలోవున్న సమయంలో 112కి సమాచారం అందించిన పది నిమిషాల్లో చర్యలు తీసుకుంటారని వివరించారు.

తపాలా శాఖ బ్యాంకింగ్ సేవలు

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ బ్యాంకింగ్ సేవలు అందిస్తుందని ఏలూరుడివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ శ్రీకర్‌బాబు తెలిపారు. ఎటువంటి ధ్రువీకరణపత్రాలు లేకుండా రూ.200 చెల్లించి తపాలాబ్యాంకు (ఐపీపీబీ) ఖాతా తెరవచ్చన్నారు. ఖాతా ఆధార్‌తో అనుసంధానం చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని పొందవచ్చని వివరించారు. వివరాలకు ఫోన్‌నెంబరు 78934 36211లో సంప్రదించాలని కోరారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు టూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు తెలిపారు. 14వ తేదీ వారోత్సవాల ప్రారంభం బాలల దినోత్సవం నిర్వహిస్తారు. 15 నుంచి పుస్తక ప్రదర్శన, డ్రగ్స్ పై అవగాహన, 16న ప్రముఖులకు నివాళి, 17 రచయితల సందేశాలు, సెమినార్, కవిసమ్మేళనం, 18న వకృత్వం, 19 చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడాపోటీలు, 19న మహిళా సాధికారిత పై చర్చ, 20న డిజిటల్ గ్రంథాలయాల పై ఓరియంటేషన్ కార్యక్రమం, ముగింపు కార్యక్రమం జరుగుతాయని తెలిపారు.

15న ఏలూరులో సీపీఐ సదస్సు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొల్లేరు పరిరక్షణకై ఈనెల 15న ఏలూరులో సీపీఐ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, పర్యావరణ పరిరక్షణ వేదిక నాయకులు హాజరవుతారన్నారు.

బీఎల్‌వోలు అందుబాటులో ఉండాలి

ఏలూరు సిటీ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9, 10 , 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు ఉదయం పది నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని డీఆర్వో విశ్వేశ్వరరావు తెలిపారు. అర్హులు ఎవరైనా 6, 7,8 దరఖాస్తు ఫారాలు తీసుకోవాలన్నారు.

రోగులకు మెరుగైన సేవలందిస్తాం

ఏలూరు క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన సేవలందిస్తామని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు అన్నారు. మదనపల్లి ప్రభుత్వాసుపత్రి నుంచి బదిలీ అయిన రాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అన్ని విభాగాల్లో రోగులకు సేవలందిస్తామన్నారు. ఆయనన్ను రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బీవి కృష్ణారెడ్డి, వైద్యులు పోతుమూడి శ్రీనివాసరావు, బంకా రవికుమార్, శ్రీనివాసరావు, ఆర్ఎంఓ దుర్గా కుమార్ తదితరులు అభినందించారు.

సర్వోదయమండలి పోటీలలో ఫత్తేపురం విద్యార్థుల విజయకేతనం

నిడమర్రు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సర్వోదయ మండలి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలలో ఫత్తేపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. శుక్రవారం పాఠశాల హెచ్ఎం సత్యనారాయణ వివరాలు తెలిపారు. వ్యాసరచన, కవిత్వం, కథల పోటీలలో ఫత్తేపురం ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు చొక్కాకుల శరణ్య, పొత్తూరి శ్రీభవిత, రొక్కాల సంతోష్ కుమార్‌లు విజేతలుగా నిలిచారు. వారికి గైడ్ టీచర్‌గా వ్యవహరించిన కె. సుబ్బరాజును, విద్యార్థులను సర్పంచ్ సాయి ప్రియ, ఉపసర్పంచ్ రుద్రరాజు కొండయ్య, ఎస్ఎంఎస్ చైర్మన్ దేవి అభినందించారు.

అదుపు తప్పితే.. కాల్వలో..!



వివి నగర్ వద్ద తమ్మిలేరు వంతెనకు ఊడిన రెయిలింగ్స్

తమ్మిలేరు వంతెనపై రెయిలింగ్స్ తొలగించారు..

నగరంలోని పాతబస్టాండ్ సెంటర్ నుంచి ఫ్లైవోవర్ మీదుగా రైల్వేస్టేషన్ వైపు వివినగర్‌కు వెళ్ళే తమ్మిలేరు కాలువ వద్ద గల వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉంది. వంతెనకు రెయిలింగ్స్ నాలుగు చోట్ల ఊడిపోయాయి. రక్షణ గోడలు లేవు. దాదాపు పదేళ్ల క్రితం వరదలు వచ్చిన తరుణంలో అప్పటి జిల్లా అధికారులు వరద నీరు నగరంలోకి ప్రవేశించకుండా రెయిలింగ్స్‌ను తొలగించారు. అప్పటి నుంచి తొలగించిన రెయిలింగ్స్‌ను తిరిగి నిర్మించలేదు. కనీసం రక్షణ గోడలు కూడా నిర్మించలేదు. వాహనదారులే కాదు నడిచి వెళ్లే వారు సైతం బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిందే. ఏమాత్రం అదుపు తప్పినా కాల్వలో ఉంటారు. వంతెన వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి వంతెన వద్ద గతంలో తొలగించిన రెయిలింగ్స్ స్థానంలో రక్షణ గోడలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఏలూరు కార్పొరేషన్



పెదపాడులో రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



సీఎం సహాయ నిధి చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే రోషన్



ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నేతలు

రహదారి మరమ్మతులు

సంక్రాంతికి పనులు పూర్తి : ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నాటికి పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణ పనులు, మరమ్మతు పనులను పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకున్నట్లుగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని తెలిపారు. పెదపాడు మండలంలో కొత్తూరు, అందేఖాన్‌చెరువు, పెదపాడు, రామచంద్రపురం, తోటగూడెం, వసంతవాడ గ్రామాల్లో రహదారి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పల్లె పండుగ సహా ఇతర కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని స్థానిక నాయకులకు సూచించారు.

ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత

పెదవేగి: ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న కొల్లి వనజాక్షికి సీఎం సహాయనిధినుంచి వైద్య చికిత్సకు అవసరమైన రూ.1.25 లక్షల ఎల్‌వోసీ ఎమ్మెల్యే అందించారు. బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి : బడేటి

ఏలూరు టూటౌన్, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలు తీర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. చోడే వెంకటరత్నం, పూజారి నిరంజన్, జీ.నారాయణరావు, బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యలను తక్షణం పరిష్కరించాలి

ఉంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జనసేన జనవాణి కార్యక్రమంలో శుక్రవారం మంగళగిరి కార్యాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకట లక్ష్మి, మండలి రాజేష్, పార్టీ లీగల్ సెల్ కార్యదర్శి బయ్యవరపు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్లను కలుసుకుని నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్ళ వ్యవహారం గురించి చర్చించారు.

సీఎం సహాయ నిధి చెక్ పంపిణీ

లింగపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆసన్నగూడెం గ్రామానికి చెందిన ఏనుగు మేరీ అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్య ఖర్చుల కోసం స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే రోషన్ కుమార్ దృష్టికి తేవడంతో ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.97,016 చెక్‌ను మేరీ కుటుంబ సభ్యులకు అందజేశారు.

జీవో నెం.3 అమలు చెయ్యాలి

జీలుగుమిల్లి, నంబరు 8 (ఆంధ్రజ్యోతి): జీవో నెం.3 చట్టబద్ధత కల్పించాలని ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఏపీ షెడ్యూల్డ్ ఏరియాలో ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. సమస్యలను ఇతర గిరిజన ఎమ్మెల్యేలతో చర్చించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే అన్నారు. ఆదివాసీ నాయకులు తెల్లం రామకృష్ణ, కారం ధారయ్య, సరియం రామ్మోహన్, సోయం చందరావు, ధర్మల రమేష్, తెల్లం దుర్గారావు, కట్టం నాగేశ్వరావు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



లారీ యజమానులతో మాట్లాడుతున్న సీఐ రవీంద్ర

చింతలపూడి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు భద్రత నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని సీఐ ఎం.రవీంద్ర నాయక్ హెచ్చరించారు. సర్కిల్ కార్యాలయంలో లారీ యజమానుల అసోసియేషన్ సభ్యులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, ఇసుక, మట్టి తరలించే వాహనాలపై పరదాలు కప్పాలని, పట్టణంలో వేగ నియంత్రణ ఉండాలని సూచించారు.పర్మిట్ ఉన్న వాహనాలు మినీ బైపాస్ రోడ్డులో వెళ్ళాలన్నారు. కామవరపుకోట, లింగపాలెం మండలాల పరిధిలోని లారీ, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. ఆటోలో పరిమి తికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. పట్టణంలో దుకాణాలకు వచ్చే వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూసే బాధ్యత ఆ వ్యాపారులదేనని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ కుటుంబరావు, లారీ అసోసి యేషన్ నాయకులు యామిజాల మూర్తి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థం

ఉంగుటూరు, నవంబరు 8 (ఆంధ్ర జ్యోతి): యువత, విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్ల వద్దని చేబ్రోలు ఎసై ఎం.సూర్య భగవాన్ సూచించారు. నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రిన్సిపాల్ టి.కే.విశ్వేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు శారీరక మానసిక ఆరోగ్యంతో పాటు సామాజిక ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. లోన్ యాప్‌ల జోలికి వెళ్ళవద్దన్నారు. కార్యక్రమంలో కొండా రవి, హెప్సీబా, ఐక్యూఏసీ రెడ్డియ్య విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము రేగుతున్న రహదారి.. వ్యాపారుల నిరసన



నాలుగు రోడ్ల కూడలిలో నిరసన దుకాణదారులు

జీలుగుమిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై దుమ్ముతో నెలల తరబడి అనారోగ్యం పాలవుతున్నామని జీలుగుమిల్లి నాల్గు రోడ్ల కూడలిలో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రోడ్డుపై వాహనాలు నిలిపి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. కొంతకాలంగా జాతీయ రహదారి మరమ్మతు పనులు జరగక రోడ్డుపై గుంతలు పూడ్చకపోవటంతో వాహనాలు రోడ్డుపక్కన ఉన్న దుకాణాల మీదకు వస్తున్నాయన్నారు. దీంతోపాటు వాహనాలు రాకపోకలు సాగించే క్రమంలో వస్తున్న దుమ్ముతో షాపుల్లో సరుకు మొత్తం పాడవుతుందని, నిర్వాహకుల ఊపిరితిత్తుల్లో దుమ్ముచేరి అనారోగ్యం పాలవుతున్నామన్నారు. మరికొందరు డస్ట్ ఎలర్జీతో బాధపడుతున్నట్లు వాపోయారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం కావాలి

పెదవేగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అందరినీ అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీవో కె.శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్షరాస్యతే అభివృద్ధికి మూలమని అన్నారు. వలంటీర్లను నియమించి, ప్రతి గ్రామంలో మహిళలకు అక్షరాస్యులను చేయాలన్నారు. మండలంలో 27మంది వలంటీర్లను నియమించామని, మహిళలంతా విద్య నేర్చుకోవాలని ఆయన చెప్పారు. ఎంఈవో వి.అరుణ్‌కుమార్, ఏపీఎం ఏసురత్నం పాల్గొన్నారు.

ఇంటింటి జియో టాగింగ్ సర్వే

టి.నరసాపురం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి జియో టాగింగ్ సర్వే చేస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సచివాలయ సిబ్బంది ద్వారా సర్వే పనులు చేపట్టామన్నారు. మండలంలోని బ్యాంకు ఖాతాదారులు ఆధార్ లింకు చేయించుకోవాలన్నారు. పాఠశాల రికార్డుల్లో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీలు తప్పులు ఉన్న విద్యార్థులు ఆధార్‌లె ఉన్నట్లు సరి చేయించుకోవాలని సూచించారు. అందుకోసం విద్యార్థులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు సూచించారు.

భద్రకాళి ఆలయంలో నవగ్రహ మండపం నిర్మాణం



భూమి పూజ చేస్తున్న పూర్వ డీపీవో దంపతులు

ఉంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక భద్రకాళి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండప నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశా. కార్యక్రమంలో జిల్లా పూర్వ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ దంపతులు, పాతూరి వెంకటేశ్వరరావు, నారాయణ హనుమంతరావు దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యడ్లపల్లి వెంకట్రావు, మంత్రి రమణారావు, కొల్లి పెద్దిరాజు, పాతూరి వంశీకృష్ణ భద్రకాళి సేవా దళ సభ్యులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారిని సినీ రచయిత భవాని ప్రసాద్ దర్శించుకుని పూజలు చేశారు.

శివాలయాల్లో కోటి సోమవార పూజలు

ఏలూరు కార్పొరేషన్: నగరంలో శివాలయాల వద్ద శుక్రవారం భక్తులు కోటి సోమవార పూజలు చేశారు. కార్తీకమాసంలో శ్రవణా నక్షత్రంతో కలిసి వచ్చేరోజునే కోటి సోమవారంగా పిలుస్తారు. దీంతో భక్తులు పూజలు నిర్వహించారు.

మల్లేశ్వరస్వామికి పసుపు కొమ్ముల పూజ

భీమడోలు: గుండుగొలను, పూళ్ళ, కురెళ్ళగూడెం, భీమడోలు, తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భీమడోలు భీమేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. గుండుగొలను భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు, లక్ష కుంకుమార్చన, లక్ష పసుపు కొమ్ముల పూజ చేశారు.

విశిష్ట అలంకరణలో మార్కండేయస్వామి

నిడమర్రు: మందపర్రు ఉమా నీలకంఠేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం లక్షబిల్వార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి విశిష్ట అలంకరణ అలరించింది.

తేమ శాతం పేరుతో ధాన్యం ధరలో కోత



వెల్లమిల్లిలో చినిగిన గోనె సంచులతో రైతులు

ఉంగుటూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తేమ శాతం పేరుతో ధాన్యం ధరలో కోతలు విధించడంపై రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉంగుటూరు, చేబ్రోలు, నారాయణపురం, వెల్లమిల్లి గ్రామాలలో ఏపీ రైతు సంఘం ప్రతినిధులు శుక్రవారం ధాన్యం రాశులను పరిశీలించారు. జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తేమ శాతం వంక పెట్టుకుని ధరలో కోత విధించడం బాధాకరమన్నారు. చినిగిన గోనె సంచులు ప్రదర్శించి నిరసన తెలిపారు. మద్దతు ధర కంటే రూ.325 పైగా కోత పెడుతున్నారన్నారు. మద్దతు ధర రూ.1725 కాగా రూ1380 నుంచి 1400 వరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. కల్లాల నుంచి కొనుగోలు చేయాలన్నారు. గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు, వెజ్జు శ్రీరామమూర్తి, వై.సర్వారాయుడు, నాగభూషణం, కె.సూర్యనారాయణ, పి.శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

పోలవరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తహసీల్దారు బీఎస్‌వీఆర్ఎల్.రాజు సూచించారు. గూటాలలో ఏవో కె.రాంబాబు ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దారు శుక్రవారం ప్రారంభించారు. రాంబాబు మాట్లాడుతూ క్వింటాకు సాధారణ రకం రూ.2300, గ్రేడ్ ఎ రకం రూ.2320 ధర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తేమశాతం 17 లోపు ఉండాలని, రవాణా చార్జీలు, కూలీల ఖర్చు, గోనె సంచుల అద్దెలు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. ఈకేవైసీ పూర్తయిన రైతు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవచ్చని తెలిపారు.

వెలుగు వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి



ధర్నా నిర్వహిస్తున్న వెలుగు వీవోఏలు

లింగపాలెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలుగు వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నత్తా వెంకటేశ్వరరావు అన్నారు. ప్రధాన రహదారిపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రాజకీయ నాయకుల వేధింపులను అడ్డుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ నజీముల్లాషాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ మేరీ, విజయకుమారి, శ్రావణి, మరియమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది ఆందోళన

వేతన బకాయిలను చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని 104 సిబ్బంది కోరారు. జీవో నెంబర్ 7 ప్రకారం తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే 104 వాహనాలను నడపాలన్నారు. ఈ మేరకు తహసీల్దార్ నజీముల్లాషాకు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పి.రవి, జి వెంకన్నబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ ఉండాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

లింగపాలెం, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో అభివృధి పనులను అధికారులు, పజాప్రతినిధులు పర్యవేక్షించాలని ఎంపీపీ వెంకటలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షన సమావేశం జరిగింది. గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులు వివరించారు. సభ్యులు గ్రామాలలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్‌దార్ నజీముల్లాషా, ఎంపిడిఓ కందుల వాణి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ చెల్లన్నదొర

కొయ్యలగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలు పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామసభలు ఏర్పాటు చేసిందని తహసీల్దార్ చెల్లన్నదొర అన్నారు. రాజవరంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో భూసమస్యల పరిష్కారానికి సభలు ఏర్పాటు చేశామన్నారు. భూసమస్యల పరిష్కారానికి ఈ సదస్సు దోహదపడతాయన్నారు. రాజవరంలో 210అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చినతుక్కయ్య, కూటమి నాయకుడు కోనా కుమార్‌బాబు, ఆర్ఐ దివ్య, మాజీ సర్పంచ్ వాడపల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు.

పనుల్లో పురోగతి కన్పించాలి

జీలుగుమిల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పనుల్లో పురోగతి కన్పించాలని ఇన్‌చార్జి తహసీల్దారు స్లీవజోజి అన్నారు. శుక్రవారం రెవెన్యు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు దరకాస్తుల స్వీకరణపై సూచనలు ఇచ్చారు. భూముల మ్యూటేషన్, నీటి సంఘాల ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం చేయటం, స్పందనలో వచ్చిన ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపడం వంటి అంశాలపై సిబ్బందితో చర్చించారు. డీటీ బి.సందీప్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.



యర్రంపేట రహదారి మరమ్మతులు

పవన్‌కల్యాణ్ పాదయాత్రతో రహదారుల అభివృద్ధి

కొయ్యలగూడెం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పవన్‌కల్యాణ్ పాదయాత్ర దెబ్బకు రహదారులు మెరుగుపడుతున్నాయి. మండలంలోని యర్రంపేట నుంచి రాజవరం వరకు గోతుల రహదారికి అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల పవన్‌కల్యాణ్ ఇదే రోడ్డులో ప్రయాణించి రాజవరంలో గోతులు ఎక్కువగా ఉండడంతో అక్కడ పాదయాత్ర నిర్వహించారు. రోడ్ల పరిస్థితిపై కలెక్టర్ వెట్రిసెల్వి ఆర్‌అండ్‌బీ అధికారులతో మాట్లాడారు. దీంతో అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టారు. దీంతో రాజవరం, యర్రంపేట, గంగవరం, తదితర గ్రామస్థులు పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

దెందులూరులో కేంద్ర బృందం

దెందులూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలాయగూడెం గ్రామ పరిధిలోని వరి పంటను కేంద్ర ప్రభుత్వ బీమా ప్రతినిధుల బృందం శుక్రవారం పరిశీలించింది. అజయ్, కె.సింగ్ బృందం కోతకు వచ్చిన వరి, మాసూలు చేసిన ధాన్యం పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటకు పెట్టుబడి విత్తనాలు, ఎరువులు, సాగునీరు తదితర వివరాలను ఏవో వెంకటేశ్వర్లు వారికి వివరించారు.



వనజాక్షి చిత్రపటం వద్ద నివాళి

మాజీమంత్రి ఆలపాటికి పరామర్శ

పెదవేగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా) మాతృమూర్తి ఆలపాటి వనజాక్షి ఇటీవల మృతిచెందారు. పలువురు ప్రజా ప్రజాప్రతినిధులు వనజాక్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆలపాటి రాజాను పరామర్శించి, సానుభూతి తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తదితరులు మాజీమంత్రిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

5 టన్నుల బియ్యం అక్రమ రవాణా

ద్వారకాతిరుమల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుణ్ణంపల్లిలో రేషన్ బియ్యం అక్రమ రవాణాను స్థానిక యువకులు గురువారం రాత్రి అడ్డుకున్నారు. కొందరు వ్యక్తులు తాము విలేకర్లమని చెప్పి కైకరం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న బియ్యం వాహనాన్ని అడ్డుకుని డబ్బులు వసూలు చేశారు. దీన్ని గమనించిన స్థానిక యువకులు కొందరు వారిని నిలదీయడంతో నకిలీ విలేకరులు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు వచ్చి దాదాపు 5 టన్నుల బియ్యాన్ని, వాహనాన్ని ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



రెండు తలల పాము

ఐఎస్ జగన్నాధపురం పొలాల్లో రెండు తలల పాము కనబడింది. పామును చూసిన రైతు భయపడ్డారు. ఇది ఏ హాని చేయదని తెలియడంతో స్థానికుల సహాయంతో సురక్షిత ప్రదేశంలో వదిలేశారు. - ద్వారకాతిరుమల

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు రూరల్ :** గోమాతను జాతీయజంతువుగా ప్రకటించాలని, భారతీయ ధర్మపరిషత్ జాతీయ అధ్యక్షుడు, శ్రీకృష్ణ చరణానంద భారతీస్వామిజీ డిమాండ్ చేశారు. జేసీ జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు.
- **ఏలూరు రూరల్ :** ఎల్‌కే అద్వాణి పుట్టినరోజు వేడుకలు బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా విక్రమ్‌కిషోర్, కె.కృష్ణప్రసాద్ పాల్గొని స్వీట్లు పంపిణీ చేశారు.
- **ఉంగుటూరు :** కాగుపాడు గ్రామంలో శుక్రవారం నాడు ఫ్రైడే డ్రైడే వై.వీ.లక్ష్మణరావు నేతృత్వంలో నిర్వహించారు.
- **బుట్టాయగూడెం :** అమరవీరుల ఆశయ సాధన కోసం అందరం కలిసి ఐక్యంగా పోరాడుదామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు ధర్మల సురేష్ పిలుపు నిచ్చారు. గురుగుమిల్లిలో అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు.
- **ద్వారకాతిరుమల :** మండలంలోని 64 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం జరుగు తుందని తహసీల్దారు సుబ్బారావు తెలిపారు. బీఎల్వోలు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.
- ద్వారకాతిరుమల మండలంలోని వెంకట కృష్ణాపురానికి చెందిన తాళ్లూరి శోభన్‌బాబు 30 మందితో గోవిందమాలను ధరింపచేసి తన సొంత ఖర్చులతో తీర్థయాత్రలకు తీసుకెళ్లారు.

కవ్వింపు.. కథేంటి !



అవిశ్వాసం పెడతామంటూ జడ్పీటీసీల బెదిరింపులు

● జడ్పీలో కొత్త కూని రాగాలు ● సజావుగా జడ్పీ సాగకూడదనే వైసీపీ ఎత్తుగడ
● భయపడేది లేదంటున్న చైర్‌పర్సన్ పద్మశ్రీ వర్గం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)
ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ దంపతులపై వైసీపీ పదేపదే కవ్వింపులకు దిగుతున్నది. తమ పార్టీని వీడి తెలుగుదేశంలో చేర డమే ఈ దంపతులు చేసిన ప్రధాన తప్పు. నిబంధనలు పక్కాగా ఉన్నా వీటిని ఏమార్చి పదేపదే అవిశ్వాసం పెడతామంటూ బెది రింపులు. వైసీపీ మాజీ ఎమ్మెల్యేలంతా తమ పార్టీ జడ్పీటీసీలతో సమావేశమవుతూ జడ్పీ చైర్మన్ వ్యవహారం తేల్చాల్సిందేనని మొండి పట్టుదలతో ఉన్నారు. దీనివెనుక వైసీపీ నాయకత్వ డైరెక్షన్ లేకపోలేదు. జిల్లా పరిషత్‌లో తమ పార్టీకి బలం ఉన్నా అవిశ్వాసం నోటీసు ఇవ్వలేమన్న సత్యాన్ని ఆ పార్టీ గ్రహించలేకపోతోంది.

ఎందుకీ సాధింపు

ఉమ్మడి పశ్చిమ జిల్లా పరిషత్ సభ్యురాలిగా పెదపాడు నుంచి నిలిచిన ఘంటా పద్మశ్రీ కొన్ని రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేసి తెలుగుదేశంలో చేరారు. వైసీపీ రాజకీయ వ్యవహారాలు సరిపడక తన భర్త ప్రసాదరావుతో కలిసి టీడీపీవైపు మొగ్గారు. దీంతో వైసీపీ నాయకత్వం ఏదోరకంగా వారిని తిరిగి తమ పార్టీలోకి వచ్చేవిధంగా రకరకాల ఎత్తుగడలు వేశారు." సీరియస్‌గా ఆలోచించండి.. తగు రీతిలో మిమ్మల్ని కూర్చోబెడతామంటూ" ఆఫర్లు ఇచ్చారు. "అన్నీ ఆలోచించే టీడీపీలో చేరాం. ఇకముందు ఈ నిర్ణయాన్ని పునః సమీక్షించే ప్రసక్తేలేదని" ప్రసాదరావు దంపతులు వైసీపీ నేతలకు తేల్చిచెప్పారు. ఉమ్మడి పశ్చిమజిల్లా పరిషత్‌లో వైసీపీకి తిరుగులేని బలం ఉంది. కేవలం వీరవాసరం, ఆచంట స్థానాలను జన సేన, టీడీపీలు నిలబెట్టుకోగా మిగతా 46 జడ్పీ టీసీ స్థానాల్లో వైసీపీనే గెలిచింది. ఈ నేపథ్యంలో తమ పార్టీని కాదని మీరెలా జడ్పీలో పాలన చేస్తారో చూస్తామన్నట్టుగా ఆదిలోనే పద్మశ్రీ దంపతులకు అడ్డు తగిలేందుకు వ్యూహాలు పన్నారు. ఇప్పటికి ఐదుసార్లు జడ్పీటీసీలు, వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఇంతకు ముందు పార్టీలోను అప్పటి సీఎం జగన్‌కు అత్యంత ఇష్టమైన ప్రసాదరావు సైతం పార్టీని వీడడంతో మున్ముందు ఆయన దూకుడుగా ముందుకు వెళ్ళకుండా అడ్డుకునే దిశగానే ఆటంకాలు సృష్టించేందుకు సిద్ధమయ్యారన్నది ఇంకొందరి వాదన. తొలుత చైర్‌పర్సన్ పద్మశ్రీ జనసేనలోకి వెళ్ళాలనుకున్నా ఆ నిర్ణయాన్ని మార్చుకుని తన భర్త ప్రసాదరావుతో కలిసి టీడీపీలో చేరారు. ఘంటా ప్రసాదరావుతో వైరుధ్యం ఉన్న ఒక మాజీ ఎమ్మెల్యే కూడా పట్టుబట్టి మరీ ఈ తతంగాన్నంతా నడిపిస్తున్నట్టు భావిస్తున్నారు. మండలాల వారీగా పార్టీని బలోపేతం చేసే క్రమంలో ఇంతకుముందు ప్రసాదరావు కీలకంగా వ్యవహరించడంతో అప్పట్లో కొందరికి నచ్చలేదు. దీనిని ఇప్పుడు కొందరు సాకుగా తీసుకుని కథ నడుపుతున్నట్టు భావిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం జడ్పీటీసీలు జిల్లా పరిషత్ అతిథి గృహంలో సమావేశమయ్యారు. అప్పటికప్పుడు ప్రత్యేక సమావేశం పెట్టాలని జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారావుకు వినతిపత్రం ఇచ్చారు. అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ పద్మశ్రీని కలిసేందుకు విశ్వప్రయత్నం చేశారు.

ఆది నుంచి ఎకసెక్కాలే

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కౌరు శ్రీనివాస్ కొనసాగినప్పుడు, తిరిగి ఆయన స్థానంలో ఘంటా పద్మశ్రీ ప్రవేశించినప్పుడు జిల్లా పరిషత్‌లో వైసీపీ ఎన్నడూ క్రియాశీలకంగా లేదు. స్థాయి సంఘా లకు అత్యధిక సభ్యులు డుమ్మాలు కొట్టేవారు. వారి బాటలోనే అప్పటి ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రవర్తించేవారు. ఏ సమస్య వచ్చినా తమకు పట్టనట్టే మంత్రులు, ఎమ్మెల్యేలు, వారితోపాటు కొందరు సభ్యులు కూడా తేలిగ్గా తీసుకుని వ్యవహరించారన్న విమర్శ లేకపోలేదు. అధికారంలో ఉండి జిల్లాకు ప్రత్యేకించి నిధులు రాబట్టే ప్రయత్నమూ అప్పట్లో జరగలేదు.

బలం చూసుకునే బరితెగింపా

వాస్తవానికి జిల్లా పరిషత్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరాలనుకున్నా లేదా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాలనుకున్నా ఎట్టి పరిస్థితుల్లోనూ పంచా యతీరాజ్ స్థానిక సంస్థల నిబంధనల ప్రకారమే ఎవరైనా నడు చుకోవాల్సి ఉంది. కాని వైసీపీ మాత్రం పదేపదే చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై అవిశ్వాసం ప్రవేశపెడతామంటూ హడావుడి చేస్తున్నారు. మా బలం ఏమిటో చూపిస్తామంటూ రెచ్చిపోతున్నారు. వాస్తవానికి చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో పాటే మరికొందరు జడ్పీటీసీలు తెలుగుదేశం, జనసేనల్లో చేరాల్సి ఉన్నప్పటికి కొద్దికాలం తరువాత చూద్దామని టీడీపీ, జనసేన నాయకత్వాలు చేరికలను వాయిదా వేశాయి. ఇప్పుడు వైసీపీ చేస్తున్నట్టుగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదన చెల్లుతుందా, లేదా అనేది మాత్రం ఆ పార్టీ పట్టించుకోవడం లేదు. జిల్లా పరిషత్‌లో చైర్‌పర్సన్‌గా ఎవరున్నా సదరు వ్యక్తి వరుసగా నాలుగేళ్ల పాటు పదవిలో కొనసాగిన తరువాత మాత్రమే అవిశ్వాస తీర్మానం పెట్టడానికి మిగతా సభ్యులకు వెసులుబాటు. ఇదే విషయాన్ని జీవో 244లో స్పష్టంగా ఉంది. ఘంటా పద్మశ్రీ చైర్‌పర్సన్‌గా ఇప్పటికి 15 నెలలు అయింది. అలాంటప్పుడు ఆమెపై ఎలా అవిశ్వాస తీర్మానం పెడతారో వైసీపీకే తెలియాలంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఎంతమంది సభ్యులు ఉన్నారనే దానిపైనా ఇప్పటికీ స్పష్టత లేదు. ఆమెకు వ్యతిరేకంగా 31 మంది ఉన్నారని వైసీపీ 'షో' చేస్తున్నది. ఈనెల 11న జరగనున్న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశంలోను ఈ తీర్మానం ప్రవేశపెట్టాలని వైసీపీ తహతహలాడుతోంది.

జనం కోసమే మేము : ఘంటా పద్మశ్రీ

ప్రజాసేవ చేయాలనుకునే రాజకీయాల్లోకి వచ్చాం. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూడా ఇదే విధానాన్ని పాటిస్తున్నాం. మాకు కావా ల్సింది ప్రజల బాగోగులే. జిల్లా పరిషత్‌కు నియమ నిబంధనలు ఉన్నాయి. ఎవరైనా గీత దాటాలనుకున్నా కుదరదు. కేవలం భయ పెట్టి లబ్ధి పొందాలనుకుంటున్న కొందరి ప్రయత్నాలకు మేమేమీ బెదరం. పార్టీ నిర్ణయాలకు అనుగుణంగానే నడుచుకుంటాం.

స్థాయి సంఘ సమావేశాలు వాయిదా

వైసీపీ జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరు

ఏలూరుసిటీ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు సభ్యుల కోరం లేక వాయిదా పడ్డాయి. ఏలూరు జడ్పీ కార్యాలయంలో శుక్రవారం సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఉదయం పది గంటలకే సమావేశానికి విచ్చేశారు. పలు శాఖల ఉన్నతాధికారులు వచ్చారు. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 48 మంది జడ్పీటీసీ సభ్యులుండగా వీరిలో 46 మంది వైసీపీకి చెందిన వారు. ఆచంట జడ్పీటీసీ టీడీపీ సభ్యుడు కాగా, వీరవాసరం జడ్పీటీసీ జనసేనకు చెందిన వారు. సమావేశాలకు వైసీపీకి చెందిన జడ్పీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. సభ్యుల కోరం లేక పోవడంతో జడ్పీ స్థాయి సంఘ సమావేశాలను వాయిదా వేస్తున్నట్టు జడ్పీ సీఈవో సుబ్బారావు తెలిపారు.

11న జడ్పీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ఏలూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీపై పార్టీ ఫిరాయింపులు చట్టం ప్రకారం ఈనెల 11న జరిగే జడ్పీ సర్వసభ్య సమావేశంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెడుతున్నట్టు జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు తెలిపారు. శుక్రవారం జరగాల్సిన స్టాండింగ్ కమిటీ సమావేశాలను వైసీపీ జడ్పీటీసీలు 37 మంది బాయ్‌కాట్ చేశారు. ఆయా నియో జకవర్గాల ఇన్‌ఛార్జ్‌లతో దూలం నాగేశ్వరరావు అధ్యక్షతన జడ్పీ టీసీలు భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో విజయ్‌బాబు మాట్లాడుతూ ఇటీవల గంటా పద్మశ్రీ టీడీపీలో చేరారని వైసీపీ విప్ ధిక్కరించారని, పంచాయతీరాజ్ చట్టాన్ని అతిక్రమించి పార్టీ ఫిరాయించారన్నారు. తామంతా జడ్పీ చైర్మన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి తీర్మానించామన్నారు. సమావేశంలో ఆయా మండలాల జడ్పీటీసీలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ముదునూరి ప్రసాద్‌రాజు, కొటారు అబ్బయ్యచౌదరి, బాలరాజు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు

టీచర్లకు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ

ఏలూరు అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు ఇక మీదట ఇచ్చే శిక్షణలన్నింటినీ నాన్-రెసిడెన్షియల్ పద్ధతిలోనే ఆయా జిల్లాలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పాఠశాలవిద్య కమిషనర్ విజయరామరాజు నేతృత్వంలోని ఉన్నతాధికారులు అంగీకరించారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.అంజనేయులు తెలిపారు. శుక్రవారం విజయవాడలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ఉన్నతాధికారులు నిర్వహించిన సమావేశంలో చర్చించిన విషయాలు, వాటిపై అధికారుల హామీలు, నిర్ణయాలను విలేకరులకు తెలిపారు. టీచర్ల నియామకాలకు, పదోన్నతులకు ఒకే విధమైన విద్యార్హతలను ఎన్‌సీటీఈ నిబంధనల మేరకు అమలు చేయాలని కోరగా అంగీకరించారని వివరించారు. జీవో 117 ఉత్తర్వుల రద్దు అనంతరం అమలు చేయాల్సిన విధానంపై ఉపాధ్యాయ సంఘాలనుంచి అందిన ప్రతిపాదనల ఆధారంగా రెండు వారాల్లోగా ముసాయిదా ఉత్తర్వులను విడుదల చేస్తారని తెలిపారు. 6, 7, 8వ తరగతుల్లో 60 మందికిపైగా విద్యార్థులున్న ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్ళుగా అప్‌గ్రేడ్ చేయడానికి అంగీకరించారని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26)నుంచి సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయడానికి హామీ ఇచ్చారని, శిక్షణ కార్యక్రమాలు ఏమైనా ఉంటే శనివారం మాత్రమే నిర్వహిస్తారని తెలిపారు. బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన అన్ని నిర్ణయాలు, నిబంధనలు, సీనియార్టీ జాబితా లను రెండు, మూడు నెలల్లో తుదిరూపు ఇస్తామని ఉన్నతాధికారులు చెప్పారన్నారు. ఈ ఏడాది ఇప్పటికే పని సర్దుబాటు ప్రక్రియ పూర్తయినందున ఎక్కడైనా సబ్జెక్టు టీచర్ల కొరత ఉంటే ఈనెల పదో తేదీ నుంచి పన్నెండో తేదీలోపు వివరాలు తెప్పించుకుని సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. సమావేశంలో విద్యాశాఖ తరఫున డైరెక్టర్ పి.పార్వతి, సమగ్రశిక్షా సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ శ్రీనువాసులరెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు అబ్రహం, శైలజ తదితరులు పాల్గొన్నారు



బోరు బావులతో ముప్పు

తవ్విన బోర్లు 30 వేలు
10 బావుల్లో మాత్రమే నీరు

చాట్రాయి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో యథేచ్ఛగా బోరుబావుల తవ్వకం ముప్పు ముంచుకొస్తున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బోరుబావులను 300 అడుగుల వరకు తవ్వి సబ్‌మెర్సిబుల్ విద్యుత్ మోటార్లు అమర్చి భూగర్భ జలాలను తోడుతున్నారు. ఈమండలంలో మొత్తం వ్యవసాయం బోరుబావులపై ఆధారపడి ఉంది. గత 20 ఏళ్ల నుంచి రైతులు సాగునీరు కోసం బోరుబావులు తవ్వుతున్నారు. బోర్లలో నీరు పడకపోవటం, పడినా చాలా తక్కువ ఉండడం తదితర కారణాలతో ఒక్కో రైతు 4, 5 బోరుబావులు తవ్వారు. అనధికార లెక్కల ప్రకారం మండలంలో 30 వేలు పైగా బోరుబావులు తవ్వినట్లు అంచనా. సుమారు 20 వేలు వరకు నీరు పడని బోరుబావులు పూడ్చి వేశారని తెలుస్తోంది. ఉచిత విద్యుత్ పథకం అమలులోకి వచ్చిన తరువాత బోరుబావుల తవ్వకం బాగా పెరిగింది. దాదాపు రైతులందరూ బోరు నీటితో ఖరీఫ్, రబీ పంటలు పండిస్తున్నారు. కొంతమంది కుటుంబ సభ్యుల పేరుతో 2, 3 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తీసుకొని ఉపయోగిస్తున్నారు. భూగర్భ జలాలు విపరీతంగా తోడడం వలన భవిష్యత్తులో నీటి చుక్క కరువయ్యే ప్రమాదం ఉన్నదని పలువురు నిపుణులు అంటున్నారు. ముప్పు నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విద్యాసాగర్

సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

కలిదిండి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. కలిదిండిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సమాచార హక్కు చట్టం 2005పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం 2005 ద్వారా రైతులు అడిగే సమాచారాన్ని ఎరువులు, పురుగు మందుల డీలర్లు అందించాలన్నారు. రైతులు, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

'ముదినేపల్లి మండలాన్ని కృష్ణా జిల్లాలో కలపాలి'

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కోరారు. కొత్తగా జిల్లాల ఏర్పాటు సందర్భంగా భౌగోళిక, నైసర్గిక స్వరూపం లాంటి అంశాలను, ప్రజావసరాలను పరిగణలోకి తీసుకోకుండా ఎంపీ నియోజకవర్గ ప్రాతిపదికన ముదినేపల్లి మండలాన్ని ఏలూరు జిల్లాలో కలపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని శుక్రవారం ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడకు పంపిన వినతిపత్రంలో కోరారు.

అయ్యప్పస్వాములకు భిక్ష

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం సుమారు 600 అయ్యప్ప మాలా ధారులకు సింగరాయ పాలెం గ్రోవెల్ ఫీడ్ కంపెనీ యాజమాన్యం కార్తీక అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. గురుస్వామి నీలం మల్లేశ్వరరావు, మందిర చైర్మన్ పరసా ఏడుకొండలు, వైస్ చైర్మన్ నీలం నరసింహారావు పాల్గొన్నారు.

యువకుడిపై ఫిర్యాదు

ముదినేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మైనర్ అయిన తన కుమార్తెకు రెండు రోజుల క్రితం మాయమాటలు చెప్పి మీగడపురానికి చెందిన హరి అనే యువకుడు తీసుకువెళ్లి పోయి వేధిస్తున్నాడని మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు.

రేపు ఏలూరులో పాఠశాల ఆయాల మహాసభ

నూజివీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల రాష్ట్రమహాసభ ఈనెల 10న ఏలూరులో జరగ నుంది. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నూజివీడులో కరపత్రాలను విడుదల చేశారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు నాలుగునెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని కోరారు. 100మందికి పైబడిన విద్యార్థులు ఉన్న పాఠశాలలో సైతం ఒక ఆయానే ఉండటం వల్ల వారిపై పనిభారం పడుతోంది. మరో ఆయాను నియమించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవోనెంబర్ 108 ప్రకారం రూ.11,500జీతం ఇవ్వాలని, ప్రభుత్వ ఖాతా నుంచి జీతాలు విడుదల చేయాలని ఆయన కోరారు. ఎస్‌ఎంసీ కమిటీల పేరుతో ఆయాలను తొలగించకూడదని, రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఆయాలకు ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆయాల సంఖ్యను పెంచాలని కోరారు. స్కూల్ విలీనంలో భాగంగా ఆయాలకు ఇంకోచోట పని కల్పించి, ఉద్యోగ భద్రత ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, మెడికల్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. వీటిపైనే మహాసభలో చర్చించి ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు ఆయన తెలిపారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఏలూరు టూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు తెలిపారు. 14న వారోత్సవాల ప్రారంభం బాలల దినోత్సవం నిర్వహిస్తారు. 15 నుంచి పుస్తక ప్రదర్శన, డ్రగ్స్‌పై అవగాహన, 16న ప్రముఖులకు నివాళి, 17 రచయితల సందేశాలు, సెమినార్, కవిసమ్మేళనం, 18న వకృత్వం, 19 చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, క్రీడాపోటీలు, 19న మహిళా సాధికారితపై చర్చ, 20న ముగింపు కార్యక్రమం జరుగుతాయని తెలిపారు.

కొల్లేరు గ్రామాల్లో రహదారుల అభివృద్ధిని..

అడ్డుకుంటే సహించను

ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పర్యావరణం, పక్షులు ఎంత అవసరమో అంతకంటే ఎక్కువ ప్రజాజీవనానికి ఇబ్బందులు లేకుండా రోడ్ల నిర్మాణాన్ని చేయాల్సి ఉందని, ఇటీవల వచ్చిన వరదలకు కొల్లేరులోని రహదారులు ధ్వంసం అయ్యాయని వాటి పునఃనిర్మాణంలో ఫారెస్టు అధికారులు అడ్డుకుంటే సహించేది లేదని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరు మండలం గుమ్మళ్ళపాడులో జడ్పీ నిధులతో నిర్మాణం చేసిన సీసీ రోడ్లను, జలజీవన్ మిషన్ ద్వారా నిర్మాణం చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కొల్లేటికోట పీహెచ్‌సీని పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచి వాలయాల నిర్మాణాల పేరుతో కొల్లేరు గ్రామాల నుంచి రూ.10లక్షలు చొప్పున కాంట్రాక్టర్ వసూలు చేశారని, ఇప్పటి వరకు జరిగిన పనులపై నివేదిక తయారుచేసి ఇస్తే కాంట్రాక్టర్ నుంచి రూ.10లక్షలు చొప్పున గ్రామానికి అప్పగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లేరు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.కోటి కేటాయిస్తున్నామన్నారు. సర్కారు కాల్వ వంతెనపై సిగ్నల్ లైట్లు ఏర్పాటుచేయాలని రూరల్ సీఐ రవికుమార్‌ని ఆదేశించారు. ఎంపీపీ అడవి కృష్ణ, జడ్పీటీసీ కురేళ్ళ బేబి, నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కోకన్వీనర్ బలే ఏసురాజు, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, పూల రామచంద్రరావు, కొల్లి వరప్రసాద్ పాల్గొన్నారు.



గుమ్మళ్ళపాడులో సీసీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

వినాయకుడి ఆలయానికి భూమి పూజ

కలిదిండి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కలిదిండిలో పాతాళ భోగేశ్వరస్వామి ఆలయ రహదారి వంతెన వద్ద నూతనంగా నిర్మించే వినాయకుడి ఆలయానికి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దంపతులు శుక్రవారం భూమి పూజ చేశారు. మాజీ డీసీ చైర్మన్ పేటేటి సత్యనారాయణ దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నాగేంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ

ముదినేపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పెయ్యేరులో నూతనంగా నిర్మించిన నాగేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం నాగేంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. వినాయకుడి విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించారు. యాజ్ఞికుడు వడ్లమాని సత్యనారాయణ జోశ్యులు ఆధ్వర్యంలో అర్చకులు కృష్ణకిషోర్ శర్మ, వేలూరి రవికిరణ్ శర్మ హోమ కార్యక్రమాలు నిర్వహిం చారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి శాంతి కళ్యాణాన్ని నిర్వహించి అన్నసమారాధన జరిపారు. దుక్కిపాటి రాజేంద్ర ప్రసాద్, సర్పంచ్ అల్లు సుశీల, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పోలవరపు జగన్మోహనరావు, జాస్తి బాబూ రాజేంద్ర ప్రసాద్, మిల్క్ సొసైటీ అధ్యక్షుడు హనుమార పేర్నీడు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ అడుసుమిల్లి సాయికృష్ణ, ఉప సర్పంచ్ సతీష్ తదితరులు పాల్గొని పూజలు జరిపారు.



పెయ్యేరులో ప్రతిష్ఠించిన నాగేంద్రుడి విగ్రహం

భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : ఆర్డీవో

కలిదిండి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భూసర్వే రెవెన్యూ గ్రామసభల్లో భూ సమస్యలపై రైతులు అందించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరిం చాలని ఆర్డీవో అచ్యుత అంబరీష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలిదిండి తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించి రెవెన్యూ గ్రామ సభల్లో రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్ఐ శ్యామల, సర్వేయర్ మహ్మద్ షమి, వీఆర్వోలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్

నూరు శాతం అక్షరాస్యత సాధించాలి

నూజివీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో నూరు శాతం అక్షరాస్యత సాధించాలని ఆగిరిపల్లి మండల ఎంపీడీవో భార్గవి కోరారు. ఆగిరిపల్లి వెలుగు కార్యాలయంలో శుక్రవారం అక్షరాస్యత ప్రోగ్రామ్‌పై మండలస్థాయిలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం వెలుగు ఏపీఎం దయాల రాజశేఖర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న భార్గవి మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, అక్షరాస్యత, డిజిటల్ అక్షరాశ్యత, క్రియాత్మక అక్షరాశ్యతల గురించి 100రోజుల కార్యక్రమంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 100 రోజులు శిక్షణ పూర్తి అయిన అనంతరం పరీక్షలు నిర్వహించి, వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. వలంటరీ టీచర్స్ లెర్నర్స్‌కు సంబంధించినటువంటి ట్రైనింగ్ మెటీరియల్ బుక్స్ అక్షర వెలుగు మార్గదర్శిని, అక్షర వెలుగు సంక్షిప్త వార్షికం ఆవిష్కరించి ఆహూతులు అందరికి అందచేశారు. ఏపీఎమ్ రాజశేఖర్ మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలో 19 పంచాయతీల్లో 27 సెంటర్స్ ద్వారా ఒక్కో సెంటర్లో ఒక్కో టీచర్‌కు ఒకపదిమంది లెర్నర్స్ (నిరక్షరాశ్యులు చొప్పున) మొత్తం 270మంది లెర్నర్స్‌ని డీఆర్‌డీఏ వెలుగు మండల సమాఖ్య ద్వారా గుర్తించటం జరిగిందన్నారు. వారికి 27మంది ట్రైనర్స్ (వివోఏ)ద్వారా మార్చి 2024వరకు చదువు చెప్పించే కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఏలూరు జిల్లా వయోజన విద్య, ఏపీవో విజయ్‌కుమార్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించి కుటుంబం, ఇరుగు పొరుగు, పరిశుభ్రత, ఆరోగ్యం, ఎన్నికలు, మాయింటి మహాలక్ష్మి, అలాగే మహిళలకు ఉండే చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఎంఈవోలు సర్వేశ్వరరావు, ఆనంద్‌లు కూడా ఈ కార్యక్రమంలో మాట్లాడారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీపై సమావేశం

చాట్రాయి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం 2023-24 కింద జరగనున్న సామాజిక తనిఖీపై అవగాహన సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం ఎస్‌ఆర్‌పీ నందిని మాట్లాడుతూ మండలంలో కూలీల వేజ్ కాంపొనెంట్ పనులు రూ 8.50 కోట్లు, మెటీరియల్ కాంపొనెంట్ పనులు రూ.2.50కోట్లు మొత్తం రూ.11 కోట్లు పనులు జరిగాయన్నారు. సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలకు వెళ్ళి కూలీలకు చెల్లింపులు, పనులు, నిర్మాణం జరిగిన భవనాలు పరిశీలించి నివేదికలు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ నాగరాజు, ఏపీవో లక్ష్మీకుమారి, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

జాతీయ రహదారి పరిధిలో పనులు చేపట్టండి

కేంద్రానికి ఎంపీ పుట్టా మహేశ్ వినతి

ఏలూరు టూటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలోని జాతీయ రహదారి పరిధిలో సర్వీస్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, కల్వర్టు పనులు చేపట్టాలని కేంద్ర రోడ్ల రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఉమాశంకర్‌కు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఆయన కార్యాలయం లో శుక్రవారం కలిసి వినతిపత్రం సమర్పించా రు. నూజివీడు నుంచి ముసునూరు మీదుగా ఏలూరు హైవేలో ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద ల వలన చింతలపూడి, నూజివీడు, పోలవరం పరిధిలో రహదారులు దెబ్బతిన్నాయని ఈ రోడ్లను డబల్‌లైన్‌గా అభివృద్ధి చేయాలన్నారు.



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయసేవాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మి

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కైకలూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగియుండాలని కైకలూరు సీనియర్ న్యాయసేవాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మీ అన్నారు. శ్యామలాంబ పురంలో శుక్రవారం జాతీయ సేవల దినోత్సవం సందర్భంగా చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలున్నాయన్నారు. న్యాయవాదులు పి.పవన్‌కాంత్, కందుల రమాపార్వతీ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న ఎస్ఐ వెంకటకుమార్, తదితరులు

ఆపద సమయంలో 112కు ఫోన్ చేయండి

కైకలూరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎవరికైనా ఆపద సంభవిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 112కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని కైకలూరు టౌన్ ఎస్ఐ వెంకట్‌కుమార్ అన్నారు. వేమవరప్పాడు ఎంపీయూపీ స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా విద్యార్థులు పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే ఉపాధ్యాయుల దృష్టికి లేదా తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లాలని, అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. హెచ్ఎం చిట్టూరి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న మద్యం


చిన్నంపేటలో మద్యం 37 సీసాలు స్వాధీనం

చాట్రాయి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో కోరుకొండ ప్రసాద్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు శుక్రవారం దాడిచేశారు. 37 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. అక్రమంగా మద్యం, సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

బెల్టు తీస్తాం

నూజివీడు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో బెల్టుషాపులు, సారా తయారు చేసేవారు, నల్లబెల్లం సరఫరాదారులపై కఠినచర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యం విక్రయించాలన్నారు. మద్యం దుకాణదారులు బెల్టు షాపులకు మద్యం సరఫరా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు ప్రజల దృష్టికి వస్తే 9440902462కు సమాచారం తెలియచేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

శుక్రవారం జరిగిన ఎక్సైజ్‌దాడుల్లో నూజివీడు పట్టణం అజరయ్యపేటకు చెందిన కాళహస్తి సుధ, ఆమె భర్త విజయ రాజమౌళిని అరెస్ట్ చేశారు. ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని వారిపై కేసునమోదు చేసి కోర్టుకు తరలించినట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు.



రెండు తలల పాము

ఐఎస్ జగన్నాధపురం పొలాల్లో రెండు తలల పాము కనబడింది. పామును చూసిన రైతు భయపడ్డారు. ఇది ఏ హాని చేయదని తెలియడంతో స్థానికుల సహాయంతో సురక్షిత ప్రదేశంలో వదిలేశారు. - ద్వారకాతిరుమల